ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 12 | సంచిక : 2 | అక్టోబర్ 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

పాలకొల్లు .......... 05-01-06
పిప్పర ................ 09-04-06
భీమవరం .......... 12-04-06
పాతాళమెరక .... 28-11-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-08-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది భగవంతుడు ఒక్కడే. జీవుడు లేడు, జగత్తు లేదు, స్నేహాలు లేవు, విరోధాలు లేవు, లాభం లేదు, నష్టం లేదు, ఏమీ లేదు, ఇవి అన్నీ అసత్యములే. కాని ఇవి అన్నీ నిజంలాగ మనకు కనిపిస్తున్నాయి కాబట్టి మనకు దుఃఖం వస్తోంది. స్నేహం ఉంటే ఇష్టం వస్తుంది, విరోధం ఉంటే అయిష్టం వస్తుంది, ఇవి అన్నీ నిజంలాగ మనకు కనిపిస్తున్నాయి, కాని ఇవి నూటికి నూరుపాళ్ళు అసత్యం, ఇది మాయ అని మనకు తెలియటం లేదు. నా దయ లేకుండా నా మాయను ఎవరు జయించ లేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మనకు వచ్చే తలంపులన్నీ నిజం కాదు. మనకు ఒకోసారి కోపం వస్తుంది, ఒకోసారి అసూయ వస్తుంది, ఒకోసారి భయం వస్తుంది, ఒకోసారి కోరిక వస్తుంది, ఒకోసారి ద్వేషం వస్తుంది, ఇవి అన్నీ తలంపులే, ఇది అంతా మాయే. ఇది అంతా మాయ అని మనకు తెలియటం లేదు, మాయ అని తెలిస్తే అందులోనుండి బయటకురావటానికి ప్రయత్నం చేస్తాము.

కృష్ణుడు చాలా స్నేహపాత్రుడు. కృష్ణుడు, కుచేలుడు చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. కుచేలుడి దారిద్ర్యాన్ని చూసి ఆ దారిద్ర్యాన్ని పోగొట్టాడు. కొంతమంది స్నేహం చేసినట్లు నటిస్తారు కాని స్నేహపాత్రులుగా ఉండరు. నా దారిద్ర్యం పోగొట్టమని కుచేలుడు అడగలేదు కాని అతని పరిస్థితి చూసి దారిద్ర్యం పోగొట్టాడు. భారతయుద్ధంలో అర్జునుడి మీదకు గురిపెట్టిన బాణాలు కొన్ని ఈయన మీద పడ్డాయి, అనేక దెబ్బలు తిన్నాడు. అర్జునుడి గురించి ఆడిన మాటను కూడా తప్పాడు. భారతయుద్ధంలో భీష్ముడు విజృంభించి

పోరాడుతూ ఉంటే అర్జునుడిని రక్షించటం కోసం చక్రం పుచ్చుకొని భీష్ముడి మీదకు వెళతాడు. అప్పడు అర్జునుడు అంటాడు నీవు ఆడినమాట తప్పతున్నావు, నీకు అగౌరవం వస్తుంది అని చెపుతాడు. నువ్వు చనిపోయాక నేను గౌరవం ఏమిచేసుకొంటాను అంటాడు, అదీ స్నేహం. నాకు గౌరవం అక్కరలేదు, ప్రతిష్ఠ అక్కరలేదు, నువ్వు నాకు స్నేహితుడవు, నిన్ను రక్షించటం నా బాధ్యత అంటాడు కృష్ణుడు.

రామకృష్ణపరమహంస చెప్పిన మాటలను మహేంద్రనాద్‌గుప్త వ్రాసారు. ఆయన హైస్కూలులో హెడ్‌మాష్టారుగా చేసేవారు. స్కూలు సాయంత్రం 5 గంటలకు విడిచిపెడతారు, ఒకరోజు ఆయన మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి పరమహంస దగ్గర కూర్చొన్నారు. స్కూలు 5 గంటల వరకు ఉంటుంది కదా ఇప్పడు వచ్చి ఇక్కడ కూర్చొన్నావు ఏమిటి అని రామకృష్ణుడు అడిగారు. మా స్కూలు పెత్తనం చేసే ఆయన వచ్చారు, ఇప్పటి వరకు అన్నీ చూసి వెళ్ళారు. స్కూలు యజమాని వచ్చి వెళ్ళినప్పడు ఆయన గౌరవం కోసం ఒక పూట సెలవు ఇచ్చేస్తాము అందువలన ఇప్పడు వచ్చాను, స్కూలు మానేసిరాలేదు అని గుప్తగారు చెప్పారు. మీ స్కూలు యజమాని ఎవరు అని అడిగారు, విద్యాసాగరుడు అని గుప్త చెప్పారు. మీ స్కూలు యజమాని కలకత్తాలో రెండుసార్లు కనబడ్డాడు, ఏమండీ పరమహంసగారు మిమ్మల్ని చూడటానికి దక్షిణేశ్వరం వస్తాను అని చెప్పాడు కాని రాలేదు. ఆయన ఉద్దేశం ఏమిటి అంటే ఆయన ధనవంతుడననీ, ఏదో బాగా చదువు ఉందని నేను ఏదో పేద బ్రాహ్మణుడననీ అనుకొంటున్నాడు. సర్వసాధారణంగా పండితులకు, ధనవంతులకు లోపల గర్వం ఉంటుంది కాని గర్వం లేనట్లు పైకి నటిస్తారు. ఆయనకు కలకత్తాలో గౌరవం ఉండవచ్చు, ఆయనకు పాండిత్యం ఉండవచ్చు, ధనం ఉండవచ్చు ఇవన్నీ మూడురోజుల ముచ్చట అని రామకృష్ణుడు చెప్పారు. మీరు పండితులతోటి, ధనవంతులతోటి స్నేహం చేయకండి, ఎందుచేతనంటే వారికి లోపల అంతా గర్వమే, ఏదో ఉపనిషత్‌లు చదివి పాడిపాడి మాటలు చెపుతూ ఉంటారు, అటువంటివారితో కలిసి తిరగవద్దు. సత్‌పురుషులతోటి, సాధుపురుషుల తోటి, బుద్ధిమంతుల తోటి స్నేహం చెయ్యండి మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని గుప్తగారితో రామకృష్ణుడు చెప్పారు. జీవుడు నిజం కాదు, జగత్తు నిజం కాదు, ధనం నిజంకాదు, గౌరవం నిజంకాదు ఇవన్నీ మూడురోజుల ముచ్చటే ఇది నువ్వు గుర్తుపెట్టుకో మహేంద్రనాధ్‌గుప్త అని చెప్పారు.

మనం ఉద్రేకంతో ఏదైనా పనిచేసినా, చిరాకుగా ఏదైనా పనిచేసినా, కోరికతో చేసినా మనం చేసిన పనులకు మనమే దుఃఖపడవలసి ఉంటుంది. ఎవరితోనైనా ఉద్రేకంగా

మాట్లాడినా, కోపంగా మాట్లాడినా, చిరాకుగా మాట్లాడినా మనం ఎవరి గురించి అంటున్నామో వారికి దుఃఖం రాదు, మనకే దుఃఖం వస్తుంది. కోపం అనేది ఒక దురద, దురద తరువాత మంట వస్తుంది అలాగే మనం ఎవరితో అయినా చిరాకుగా మాట్లాడితే, ఇలా మాట్లాడాము ఏమిటి అని మనకే దుఃఖం వస్తుంది. మీకు జ్ఞానం కావాలంటే రాగద్వేషాలు వదులుకోండి. ఇష్టాలు, అయిష్టాల వలన ప్రమాదం ఏమిటి అంటే వాటి వలన మీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఒక మనిషి నిజంగా చెడ్డవాడు అనుకోండి వాడు చెడ్డవాడు అయితే వాడి గొడవ వాడికి వదిలేయండి, వాడు చెడ్డవాడు, వాడు చెడ్డవాడు అని మీరు అనుకోవద్దు, అలా అనుకోవటం వలన మీ మనస్సు పాడవుతుంది. రాగద్వేషాలు పెరుగుతూ ఉంటే మంచి చెయ్యాలనే బుద్ధిపోతుంది, ఇది ధర్మం ఇది అధర్మం అని విడదీసుకొనే బుద్ధి కూడా పోతుంది. అందుచేత రాగద్వేషాలు తగ్గించుకోండి. మీ మనస్సును నూటికి పదివంతులు మాత్రమే మీ పనుల కోసం ఉపయోగించుకోండి, మిగతా 90 వంతులు భగవంతుడి పాదాలను పట్టుకోవటానికి ఉపయోగించుకోండి. మీ ఇంటి దగ్గర పనులు కూడా ఆసక్తి లేకుండా చేయండి, ఆసక్తి కనుక ఉంటే అహంభావన పెరిగిపోతుంది. ఆసక్తి పెట్టుకోవటం వలన ఎక్కువ రాదు, ఆసక్తి లేకపోవటం వలన తక్కువరాదు, భగవంతుడు ఎలాగ నిర్ణయిస్తే అలాగ వస్తుంది. ఈ లోపు మీరు ఆసక్తి ఎక్కువ పెట్టుకొంటే దొంగనేను పెరిగిపోతుంది. నాకు యిష్టాలు, అయిష్టాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంక నాకు జ్ఞానం ఎలా వస్తుంది అని కంగారుపడకు, నువ్వు అభ్యాసం చేస్తే ఇవన్నీ పోతాయి అని పరమాత్మ చెపుతున్నాడు.

మీరు ఏ దేవుడికి భక్తులు అయినా ఒకటి మర్చిపోవద్దు మీ మనస్సును బాగుచేసుకోండి. వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం ఎక్కువగా ఉంటే రోగాలు వస్తాయి, మందులు వాడితే రోగాలు తగ్గిపోతాయి కాని మీరు మంచిభావాలు లేనివారితో సహవాసం చేస్తే భావకాలుష్యం వచ్చేస్తుంది. అక్కడ అజాగ్రత్తగా ఉంటే భావకాలుష్యం వలన అనేక వేల జన్మలు వస్తాయి. అందువలన సహవాసం విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. డబ్బు సంపాదించటానికి, విద్య నేర్చుకోవటానికి, అధికారం సంపాదించుకోవటానికి మనం ఎంతో కష్టపడుతున్నాము కాని మన మనస్సును బాగుచేసుకోవటానికి మనం చేస్తున్న కృషి ఏమిటి? ఈ డబ్బుకాని, చదువుకాని, అధికారం కాని మరణానంతరం మన కూడా రావు. మన మనస్సు మన కూడా వస్తుంది. మన కూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటానికి మనం ఏమీ ప్రయత్నం చేయటం లేదు. మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకోండి. మనం ఏదైనా మాట్లాడుతూ ఉన్నా, ఏదైనా పనిచేస్తూ ఉన్నా అది దేహం నేను అనే తలంపుతో

చేస్తున్నామా లేక భగవంతుడి ప్రీతికోసం చేస్తున్నామా అని చూసుకోండి. మీరు ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసినా, మీకు ఒక ఆలోచన వచ్చినా అది దేహము నేను అనే తలంపుతో వస్తోంది. ఇంక అబద్ధమైన నేను ఎలా పోతుంది. మనం దేహాభిమానం పెరిగే పనులు చేస్తూ, దేహాభిమానం పెరిగే మాటలు మాట్లాడుతూ ఉంటే ఇంక దేహబుద్ధి ఎలా పోతుంది. తాచుపాములతో ఎంత జాగ్రత్తగా ఉంటావో అబద్ధం చెప్పేవారితో కూడా అంత జాగ్రత్తగా ఉండు అని మహేంద్రనాథ్‌గుప్తతో రామకృష్ణుడు అంటాడు. వారు పండితులు అయినా, ధనవంతులు అయినా వారితో సహవాసం వద్దు, నీవు బాగుపడాలంటే సత్పురుషులతో, సహృదయం ఉన్నవారితో సహవాసం చెయ్యి అని రామకృష్ణుడు చెప్పాడు.

మీ మనస్సును మీరు నమ్మవద్దు. మన మనస్సు ఒక రకంగా చెపుతోంది, గీతలో పరమాత్మ ఇంకోరకంగా చెప్పాడు అనుకోండి. అప్పుడు మన మనస్సును ప్రక్కకు పెట్టి గీతలో భగవంతుడు చెప్పిన దానిని అర్థం చేసుకొని ఆరకంగా జీవిస్తే మనం బాగుపడతాము. కనిపించిన అందరిమీద తీర్పులు చెప్పవద్దు. వాడు ఇటువంటి వాడు, వీడు అటువంటివాడు అని ఎంత మంది మీద తీర్పులు చెపుతావు, సబ్జక్టు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఎదుటి మనిషి గురించి తీర్పులు చెప్పేబదులు వారిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నీకు దేహవాసన ఉంది, లోకవాసన ఉంది, శాస్త్రవాసన ఉంది. వీటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి ఇతరుల గురించి, గురువుల గురించి తీర్పులు చెపుతావా? ఇతరుల గురించి తీర్పులు చెప్పవద్దు. నీ హృదయంలోనే భగవంతుడు ఉన్నాడు, శాంతి నీ హృదయంలోనే ఉంది, బయట లేదు అని భగవంతుడు చెపుతున్నాడు, గురువులు చెపుతున్నారు. కాని ఇవన్నీ అబద్ధాలు అని మనం అనుకొంటున్నాము, మన హృదయంలో ఉంటే మనకు ఎందుకు తెలియదు అనుకొంటున్నాము. మనకు అవగాహన చేసుకొనే శక్తి లేక ఇలా అనుకొంటున్నాము. భగవంతుడు చెప్పినది నిజమే, మన హృదయంలోనే శాంతి ఉంది, ఆనందం ఉంది. కాని మనకు ఉన్న దేహవాసన, లోకవాసన, రాగద్వేషాలు ఇవే మన లోపలఉన్న శాంతిని మనకు అందనివ్వటం లేదు అనే బుద్ధి మనకు రావటం లేదు. ఆ బుద్ధిరాకపోయినా ఫరవాలేదు మనం అనుకొనేది నిజం, భగవంతుడు చెప్పినది అబద్ధం అని తీర్పులు చెపుతున్నాము. మన క్షేమం కోరేవారు మనకు మంచి మాటలు చెపుతారు, చెడ్డ మాటలు చెప్పరు. అటువంటిది దేవుడు చెడుమాటలు ఎందుకు చెపుతాడు. మనకు ఆయన చెప్పే మాటలు అర్థం కాక అబద్ధాలు చెపుతున్నాడు అనిపిస్తుంది.

మనం ఏమి చెయ్యాలి అంటే మనం ఏదైనా చదివేటప్పుడు భగవంతుడు ఇలా

చెపుతున్నాడు, అది ఎంతవరకు మనకు అర్థమవుతోంది, అర్థమయినది మనం ఎంతవరకు ఆచరించగలుగుతున్నాము, ఒకవేళ ఆచరించలేకపోతే దానికి కారణం ఏమిటి? అని ఎనాలసిస్ చేసుకొంటూ వెళితే కొంతకాలానికి ఆచరించగలుగుతాము. మీకు డబ్బు ఉన్నా అధికారం ఉన్నా, చదువు ఉన్నా మీ మనస్సును బాగుచేసుకోకపోతే ఇవన్నీ ఒకటి లేని సున్నలతో సమానము. మీకు మంత్రి పదవి వచ్చింది అనుకోండి, మీ మనస్సు పాడైపోయింది అనుకోండి, మంత్రి పదవి ఏమి చేసుకొంటారు. మంత్రి పదవి ఇవాళ ఉంటుంది, రేపు పోవచ్చు, పదవి పోతే మిమ్మల్ని పలకరించే వారు ఉండరు. ఇవి అన్నీ మూడురోజుల ముచ్చట అని రామకృష్ణుడు చెప్పేవారు. రామకృష్ణుడు చెప్పిన ఈ మాటలు గుర్తుపెట్టుకొంటే మన మనస్సుకు అటువైపు వెళ్లే వేగం తగ్గిపోతుంది. నేను పోవాలి, నేను పోవాలి అని నోటితో చెపుతూ ఆ నేను బలపడే పనులు చేస్తూఉంటే అది ఎలాపోతుంది, మనకు జ్ఞానం ఎలా వస్తుంది. ఈ లోకం నిజం కాదు, లోకాన్ని నడిపేవాడు నిజం. లోకం నిజం అనుకోవటం వలన మనకు అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది. ఎవరైనా పొగిడితే సంతోషం వస్తోంది, విమర్శిస్తే దుఃఖం వస్తోంది. అవి ఏ నేనుకు వస్తున్నాయి, అబద్ధమైన నేనుకే వస్తున్నాయి, నిజమైన నేనుకు రావటం లేదు. అది మీ బుద్ధికి అర్థమైతే మిమ్మల్ని ఎవరైనా పొగిడినా, విమర్శించినా మీకు రియాక్షన్ రాదు.

భగవంతుడితో అనుబంధం పెట్టుకోకుండా, లోకంతో అనుబంధం పెట్టుకొని నేను నాది అనే తలంపులతో తిరుగుతూ భగవంతుడు కావాలి అని కోరితే ఆయన ఎలా తెలియబడతాడు. ఆయన కోసం నీవు చేస్తున్న ప్రయత్నంలో ఎంత నిజం ఉందో ఆయన చూస్తూ ఉంటాడు. సినిమా ఎంతసేపు ఉంటుంది, మన జీవితాలు కూడా అంతే. సినిమాలో ఒకడు రాజు వేషం వేస్తాడు, ఒకడు నౌకరు వేషం వేస్తాడు, రాజు వేషం నిజం కాదు, నౌకరు వేషం నిజం కాదు. అలాగే ఇక్కడ కొంతమందికి ధనం ఉండవచ్చు, కొంత మంది బీదవారిగా ఉండవచ్చు, అదీ నిజం కాదు, ఇదీ నిజం కాదు. ఈ ప్రపంచం అనేది ఒక నాటకశాల అన్నాడు షేక్స్పియర్. ఒకో శరీరం ఒకో పాత్ర పోషిస్తుంది, ఆ పాత్రలో నటించి బయటకు పొండి అంతేగాని ఆ పాత్రతో తాదాత్మ్యం పొందవద్దు. భగవంతుడి నామాన్ని స్మరించటం వలన మనం పవిత్రులం అవుతాము అని పెద్దలు చెపుతారు. భగవంతుడి నామాన్ని స్మరించటం వలననే మనం పవిత్రులం అవ్వలేము, ఆయన మనలను పవిత్రం చేయటం వలన మనం పవిత్రులమవుతాము. ఆయన ఒకోసారి మనలను చెయ్యవచ్చు, చెయ్యకపోవచ్చు. ఎందుకు చెయ్యలేదు అని అడుగకూడదు, ఆయన ఎప్పడు చెయ్యాలో అప్పడు చేస్తాడు, ఆయన ఇంకా చేయలేదు అని నామం విడిచిపెట్టకూడదు. గోపికలకు కృష్ణుడి మీద ఎటువంటి ప్రేమభావన ఉందో, ఆంజనేయస్వామికి రాముడి మీద ఎటువంటి ప్రేమభావన ఉందో, భక్తిభావన ఉందో

అటువంటి ప్రేమభావనను ఈశ్వరుడిపట్ల మీరు పెంచుకోండి. ఈశ్వరుడి పట్ల ప్రేమభావన, భక్తిభావన మీకు కుదిరితే ప్రశ్నలు వేసేవాడు, తర్కించేవాడు ఇంక మిగలడు. మీకు ఆ ప్రేమభావన, శరణాగతిభావన లేకపోవటం వలన ఈ ఆందోళనలు, సందేహాలు వస్తున్నాయి. మనకంటే తెలివైనవాడు, ఈ సృష్టినంతా నడిపించే వాడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం నీకు లేకపోతే ఆయన మీద నీకు భక్తి ఎలా కలుగుతుంది, ప్రేమ ఎలా కలుగుతుంది. భగవంతుడు చెప్పినట్లుగా మనం నడుచుకొంటే పునర్జన్మలు తగ్గిపోతాయి. అలాకాకుండా మన అహంకారం చెప్పినట్లుగా చేస్తూ ఉంటే పునర్జన్మలు పెరిగిపోతాయి.

ఎవరైనా మంచిపనులు చేసినవారు వచ్చినప్పుడు రామకృష్ణుడు ఏమీ తెలియనట్లు ఏమనేవాడు అంటే కాశీలో ఎవరో ఫలానా రేవు కట్టించారట అనేవారు, ఆ కట్టించినవాడు అక్కడ ఉండేవాడు, అది ఆయనకు తెలుసు. ఎవరు కట్టించారు అనగానే నేను కట్టించాను అని అతడు లేచేవాడు. ఆ దొంగనేను వచ్చేసింది అనేవారు నువ్వు కట్టించటం ఏమిటయ్యా? ఆ తలంపు ఇచ్చినవాడు ఈశ్వరుడు, నీకు డబ్బు ఇచ్చినవాడు ఈశ్వరుడు, ఆ పని చేయించిన వాడు కూడా ఆయనే. నేను కట్టించాను అంటున్నావు, ఆ నేను ఎవడు? అది అబద్ధమైన నేను అని వాడికి తెలియటం లేదు. చేయించింది అంతా ఈశ్వరుడే, అసలు వీడు ఉంటే కదా చేయించటానికి అది రామకృష్ణుడు చెప్పేది. వాడు ఏదైతే నేను అంటున్నాడో ఆ నేను నిజం కాదు. ఆ నేను నిజం కాదు అని నోటితో చెపితే సరిపోదు, అది నిజంకాదు అని వాడికి అనుభవంతో తెలిసేవరకూ వాడికి జ్ఞానం రాదు. మోక్షం అంటే ఏమీలేదు దొంగనేను పోతుంది, నిజమైన నేను అనుభవంలోనికి వస్తుంది. నిజమైన నేను సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉంటుంది. అగ్నిలో నుండి వేడిని వేరుచేయలేము అలాగే ఆత్మజ్ఞానంలో నుండి సుఖాన్ని, శాంతిని వేరుచేయలేము. దేహమే నేను అని ఇప్పుడు మనం అనుకొంటున్నాము, అందుచేత పాలకొల్లులో ఉన్నాము, భీమవరంలో ఉన్నాము అనుకొంటున్నాము. నిజమైన నేను అనుభవంలోనికి వచ్చినప్పుడు, నిజమైననేను అంతటా ఉంటుంది కాబట్టి నువ్వు అంతటా ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తుంది. అప్పుడు నీకు రాకపోకలతో సంబంధం లేదు. ఒక్క భగవంతుడిని తప్పించి నీవు ఏమి సాధించినా అది అంతా మూడు రోజుల ముచ్చటే అని గుర్తుపెట్టుకో.

నిజమైనభక్తుడు ముక్తిని కూడా కోరుకోడు, వాడికి ఫలకాంక్ష ఉండదు, వాడికి ఈశ్వరుడు కనిపించి నీకు వెయ్యి జన్మలదాకా ముక్తి రాదు అంటాడు అనుకోండి వాడికి ఏమీ అనిపించదు. నువ్వు నా కూడా ఉన్నప్పుడు, నా భారాన్ని మోస్తున్నప్పుడు వెయ్యి జన్మలు కాకపోతే కోటి జన్మలు వస్తే మటుకు నాకు ఇబ్బంది ఏమిటి అంటాడు. వాడు దేనికోసం

ఎదురుచూడడు. ప్రతీ చిన్న విషయానికి ఎదురు చూడటం వలన ఆరాటం పెరుగుతుంది, ఆరాటంలోనుండి అశాంతి వస్తుంది. భక్తుడు అంటే ప్రేమ స్వరూపుడు, వాడు ఎవడికోసమైతే బతుకుచున్నాడో, ఎవడికోసమైతే జపాలు ధ్యానాలు చేస్తున్నాడో వాడు ఉన్నాడని చెప్పటానికి మాట్లాడతాడు కాని లేకపోతే వాడికి మాటలతో పనిలేదు, అది భక్తుడి లక్షణం. భక్తి వలన శక్తి పెరుగుతుంది, భక్తి వలన శాంతి కలుగుతుంది, నీవు వేరు నేను వేరు అనే బేదబుద్ధి భక్తి వలన రాలిపోతుంది, భక్తి వలన అమృతానుభవం కలుగుతుంది. భగవంతుడు వచ్చి నీకు ఏమి కావాలి అని భక్తుడిని అడుగుతాడు అనుకోండి. నాకు అది కావాలి, ఇది కావాలి అని అడగడు. నాకు ఏది మంచిదో నాకంటే నీకే బాగా తెలుసు, నువ్వు ఇస్తే పుచ్చుకుంటాను, లేకపోతే లేదు అంటాడు. ఒకవేళ నేను ఏదైనా కోరి పుచ్చుకొంటాను అనుకో, నేను కోరింది భవిష్యత్‌లో నాకు అపకారం చేస్తుందేమో అందుచేత నేను ఏదీ కోరను, నువ్వు ఏది అనుగ్రహిస్తే అది స్వీకరిస్తాను అంటాడు, అది భక్తుడి లక్షణం. అంటే ఈ లక్షణాలు మనకు ఉన్నాయో లేదో చూసుకోమని చెప్పకుండా చెప్పటం. శక్తి అంతా ఈశ్వరుడిదే, ఈ దొంగ నేనుకు శక్తి లేదు. అది మనం గుర్తించాలి. ఎప్పుడైనా మీకు కొంచెం శాంతి కలిగినా అది ఈశ్వరుడు ఇచ్చిందే, అది మీ సొంతం కాదు, అది మీ తెలివితేటల వలన వచ్చింది అనుకోవద్దు, ఈశ్వరుడే ఇస్తే మీకు శాంతి వచ్చింది. మేము సాధన చేసి జ్ఞానం సంపాదించాము అని మీరు అనుకోవద్దు, మీరు ఎన్ని సాధనలు చేసినా ఈశ్వరుడు అనుగ్రహించకపోతే మీకు శాంతిరాదు. మరణానంతరం మన కూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటం మానేసి అది సాధించాను, వారిని ఉద్ధరించాను అంటావు ఏమిటి? వారు ఉద్ధరింపబడటం వలన కూడా నీ మనస్సు బాగుపడాలి అంతేగాని దాని వలన నీకు గర్వం వస్తూ ఉంటే నీకు పునర్జన్మలు పెరిగిపోతాయి, చీకటిలోకాలు మిగులుతాయి. అర్జునా! పూర్వం నీవు అనేక యుద్ధాలు చేసావు, అప్పుడు నీకు దుఃఖం కలుగలేదు, అశాంతి కలుగలేదు. ఇప్పుడు ఈ కౌరవులను చూసి వారు నావాళ్ళు, అందులో నా గురువులు ఉన్నారు, మా కుటుంబసభ్యులు ఉన్నారు అంటున్నావు. ఇప్పుడు వారిని చూసి మమకారం వస్తోంది. పూర్వం యుద్ధాలు చేసినప్పుడు ఈ మమకారం ఏమయింది. వీరంతా నా వాళ్ళు అనుకోవటం వలన ఇదంతా వస్తోంది. ఈ మమకారాన్ని కోసేయటానికి నేను ఉన్నాను అన్నాడు పరమాత్మ. వాడు నీ చుట్టం అనుకో, వాడు సమాజానికి అరిష్టం చేస్తున్నప్పుడు వాడిని తీసెయ్యి.

మనకు ఎప్పుడైనా దుఃఖం వస్తోంది అనుకో, అశాంతి వస్తోంది అనుకో దానికి దేహబుద్ధి కారణం. దేహాభిమానం లేనివాడికి ప్రతికూలమైనపరిస్థితులు ఉన్నా వాడికి అశాంతి రాదు, దుఃఖం రాదు. మోక్షం మన హృదయంలోనే ఉంది. ఈ దేహమే సత్యం, దేహమే ఆత్మ అనే

బుద్ధిని తీసేస్తే ఇప్పడే, ఇక్కడే మోక్షం మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. తలంపుల యొక్క వేగం వలన, వాసనల యొక్క వేగం వలన లోపల ఉన్న ఆనందం మనకు అందటం లేదు అంతేగాని అక్కడ లేకపోవటం కాదు. లోపల ఉన్న ఆనందం మనకు అందితే అప్పడు ఈ దేహం ఉన్నా ఒకటే, పోయినా ఒకటే, మనకు ఏమీ బేధం తెలియదు. శాస్త్రంలో ఏమి చెప్పారు అంటే నీకు దేహాభిమానం ఉంటే ఈ శరీరం మరణించాక నీవు యమధర్మరాజు చేతికి చిక్కుతావు, వాడు ఎక్కడికి పంపాలో అక్కడకు పంపిస్తాడు, వాడి చేతికి చిక్కిన తరువాత నీవు చేసేది ఏమీ లేదు. శరీరం మరణించక ముందే నీవు ఆత్మజ్ఞానం సంపాదిస్తే ఇంక నీవు యమధర్మరాజు చేతికి చిక్కవు. వారు అలా ఎందుకు ఉన్నారు, వీరు ఇలా ఎందుకు ఉన్నారు అని అస్తమాను ఇతరుల గురించి ఆలోచించవద్దు, వారి పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి, పూర్వజన్మలలో వారు చేసిన కర్మను బట్టి వారు అలా ఉంటారు. అది మనకు తెలియక వాడు అలా ఉన్నాడు ఏమిటి అనుకొంటాము. పూర్వజన్మలో వాడు చేసిన కర్మను బట్టి వాడి దేహం ఎలా ఉండాలో, ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండి ఆ దేహం బయటకు పోతుంది. ఆ విషయం మనకు అర్థమైతే దేనికి ఆశ్చర్యం ఉండదు, ఆందోళన ఉండదు, నిశ్చలంగా నిర్మలంగా ఉంటాము. ఈ శరీరాలు అన్నీ అబద్ధమే కాని ఈ శరీరాలు ఆడించేవాడు మాత్రం నిజం, వాడే అంతర్యామి. కృష్ణుడు రాయబారానికి వెళితే దుర్యోధనుడు బంధించటానికి ప్రయత్నం చేసాడు. ఎందుచేతనంటే దుర్యోధనుడి యొక్క పాడుబుద్ధికి కృష్ణుడి యొక్క శక్తి తెలియటం లేదు. దుర్యోధనుడు గ్రహించినా, గ్రహించకపోయినా ఆయన దేవుడే. ఆ సద్బుద్ధి లేకపోవటం వలన, లోపల అంతస్థు లేక పోవటం వలన, లోపల పుణ్యబలం లేకపోవటం వలన ఆయన దేవుడు అనే భావన దుర్యోధనుడికి అందటం లేదు, మామూలుగా మనలాగే మనిషి అనుకొన్నాడు దుర్యోధనుడు. అమ్మా! నీ గౌరవం నాకు వద్దు, అగౌరవం నాకు వద్దు, ధర్మం నాకు వద్దు, అధర్మం నాకు వద్దు, పుణ్యం నాకు వద్దు, పాపం నాకు వద్దు ఈ ద్వైతం అంతా నువ్వు తీసేసుకో, ఈ దేహంతోటి, లోకంతోటి సంబంధం లేని శుద్ధమైన జ్ఞానాన్ని శుద్ధమైన శాంతిని నాకు ప్రసాదించు అంటాడు రామకృష్ణుడు. అలా కోరుకొనేవారు ఎవరైనా మనలో ఉన్నారా? దేవుడి దగ్గరకు వెళ్ళి నాకు శుద్ధ మనస్సును ప్రసాదించు, మనస్సు శుద్ధి అయితే కదా లోపల ఉన్న శుద్ధమైననేను నాకు తెలిసేది అని ప్రార్థించేవారు ఎవరైనా ఉన్నారా?

నీవు దేనికి కంగారు పడవద్దు. నీవు మంచి మార్గంలో ప్రయాణం చెయ్యి, పరుగులు పెట్టనక్కరలేదు, చీమ ఎంత నెమ్మదిగా నడుస్తుందో అంత నెమ్మదిగా నడువు కాని రైట్ డైరెక్షన్‌లో వెళ్ళు. పట్టు పురుగు అది అల్లిన గూడులోనే అది బంధింపబడిపోయి చనిపోతుంది, అలాగే ఈ కోరికలనే గూటిలో పడి మనం అంతమైపోతున్నాము. అసలు ఏ కోరిక మంచిది,

ఏ కోరిక చెడ్డది అనేది మనకు తెలియటం లేదు, ఏదో ఒక కోరిక కోరుకుంటూ ఉంటాము. అందుచేతనే భక్తుడు ఏమి చేస్తాడు అంటే నాకు ఇది కావాలి అని అడగడు, నాకేది మంచిదో నాకంటే నీకే బాగా తెలుసు, అదే చెయ్యి అంటాడు. జ్ఞానులు బ్రహ్మం, బ్రహ్మం అంటారు, మీరు ఎప్పుడూ శక్తి శక్తి అంటారు బ్రహ్మం గొడవ ఎత్తరేమిటి అని ఒకరు రామకృష్ణుడిని అడిగారు. నిప్పు లేకుండా వేడి ఉంటుందా? బ్రహ్మం లేకుండా శక్తి ఉంటుందా? ఎక్కడైతే బ్రహ్మం ఉందో అక్కడ శక్తి ఉంటుంది. నేను చెప్పే శక్తి బ్రహ్మం లేకుండా అది ఉంటుందా? అదేమి ప్రశ్న? అన్నారు రామకృష్ణుడు.

ఈ మధ్య ఒక మహాత్ముడు ఏమి చెప్పారు అంటే మీరు కింద నుండి పైకి వెళితే ఎక్కువ గొడవగా ఉంది అందుచేత పై నుండి కిందకు రండి అని చెప్పాడు. కింద నుండి పైకి వెళదాము అని చూస్తే దేహము, ఇంద్రియాలు, మనస్సు, జీవలక్షణాలు ఇవన్నీ అడ్డు వస్తున్నాయి, ఈ గొడవలు అన్నీ పెట్టుకొంటే పైకి రాలేకపోతున్నాము, పైన బ్రహ్మం ఉంది, ఈశ్వరుడు ఉన్నాడు. ఆయనను పట్టుకొని కిందకు రండి. ఏది అడ్డు వచ్చినా ఆయనే తీసేస్తాడు. వాడి మీద భక్తి పెంచుకోండి, వాడి పాదాలను ఆశ్రయించి మీరు కిందకు రండి ఈ గొడవలు అన్నీ వదిలిపోతాయి. ఒక పని కోసం మీరు తహసీల్దారు దగ్గరకు వెళితే ఆ పని అవ్వదు అంటాడు. అలా కాకుండా హైదరాబాద్ వెళ్ళి మంత్రి చేత చెప్పించారు అనుకోండి ఇంతకు ముందు ఆ పని అవ్వదు అని చెప్పినవాడే ఏమీ మాట్లాడకుండా సంతకం పెట్టేస్తాడు. కింద నుండి పైకి రావటానికి ప్రయత్నం చేస్తే ఈ కింద వాళ్ళందరకు అధికారి దొంగనేను, వాడు మనం చేసే ప్రయత్నాలు అన్నీ అణిచేస్తాడు. ఈశ్వరుడి పాదాలను ఆశ్రయిస్తే ఆయనే ఈ దొంగనేనును తప్పించేస్తాడు. అయితే మీరు ఏది చేసినా త్రికరణశుద్ధిగా చేయాలి. కొంతమందికి మనస్సులో ఒకటి ఉంటుంది, నోటితో వేరొకటి చెపుతారు, చేతితో ఇంకొకటి చేస్తారు. అలా కాదు మీకు మనస్సులో ఏదైతే ఉందో అదే నోటితో మాట్లాడాలి, ఏదైతే మాట్లాడుతున్నారో అదే చేతితో చెయ్యాలి. అలా ఉంటే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నా ఆ మార్గంలో సక్సెస్ అవుతారు. మహేంద్రనాథ్, సురేంద్రనాథ్, నరేంద్రనాథ్ వీరు రామకృష్ణ శిష్యులు. సురేంద్రనాథ్ రామకృష్ణుడితో బాగా మాట్లాడేవాడు. ఒకసారి సురేంద్రనాథ్ రామకృష్ణుడితో నాకు ఏమీ బాధ లేదండి, ఎందుకు లేదు అంటే నా భారం అంతా మీరు తీసేసుకొన్నారు, ఇంక నేను మోసే భారం ఏమీ లేదు అందుచేత నాకు ఏమీ బాధ లేదు అన్నారు. నా భారమంతా మీరు తీసుకోవటమే కాదు మీరు తీసుకొన్నట్లు నాకు తెలుస్తోంది అందుచేత నాకు భారం లేదు అన్నాడు, అప్పుడు రామకృష్ణుడు ఎంత బాగా గ్రహించావు సురేంద్రనాథ్ అన్నారట. వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం కంటే

భావకాలుష్యం చాలా ప్రమాదం, భావకాలుష్యం వలన మనస్సు పాడైపోతుంది. అందుచేత స్నేహాల విషయంలో, మాట్లాడే మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-08-06, చింతపర్రు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు వినాయకచవితి అంటే వినాయకుడు శరీరం ధరించిన రోజు. ఏ కార్యక్రమంలో అయినా మొట్టమొదటి పూజ వినాయకుడికే చేస్తారు. విఘ్నాలు రాకుండా చూసే దేవుడు. ఆయన చెవులు చాలా పెద్దవిగా ఉంటాయి అంటే మంచివిషయాల గురించి, ఆత్మజ్ఞానం గురించి బాగా శ్రవణం చేయాలి, నోరు చిన్నదిగా ఉంటుంది అంటే తక్కువగా మాట్లాడమని. మనం ఎక్కువగా శ్రవణం చేయాలి, తక్కువగా మాట్లాడాలి. కాని మనం తక్కువగా వింటాము, ఎక్కువగా మాట్లాడతాము. ఆయనకు సిద్ధి, బుద్ధి అనే రెండు శక్తులు ఉన్నాయి. సిద్ధి అంటే మనం ఏదైనా పని ప్రారంభించేటప్పుడు గణపతిని ఆరాధించి పనిప్రారంభిస్తే కార్యసిద్ధి కలుగుతుంది అంటే విజయం సిద్ధిస్తుంది. మనం గణపతిని ఆరాధిస్తే ఆత్మజ్ఞానం కలిగే బుద్ధిని ప్రసాదిస్తాడు. మనకు ఉన్న బలం ఏమిటి? మనలో ఉన్న బలహీనతలు ఏమిటి? అని మనం చూసుకోవాలి. మనం ఏ దేవాలయానికి వెళ్ళినా మనలో ఉన్న బలహీనతలను తొలగించమని భగవంతుడిని ప్రార్థించాలి, దానినే భక్తి అంటారు. సరళహృదయం లేనివాడికి, సహృదయం లేనివాడికి భక్తి వస్తుందా, జ్ఞానం వస్తుందా అన్నారు రామకృష్ణుడు. సరళహృదయం లేనివాడికి ఆత్మజ్ఞానం గురించి చెప్పటం ఎటువంటిది అంటే సిమెంట్ చేసిన రాతి మీద ఊడుపు ఊడ్చటం వంటిది, అది ఫలించదు. అయితే సహృదయం, సరళహృదయం సంపాదించటం చాలా కష్టం. మనం ఎంతో కొంత సత్కర్మ చేస్తేగాని, నిష్కామంగా చేస్తేగాని సరళహృదయం రాదు.

రామకృష్ణుడు భక్తి గురించి చెపుతూ ఉంటే మీరు ఇలాగే చెపుతూ ఉంటారు కాని మాకు ప్రపంచం మీద మోహం ఎక్కువగా ఉంది అనేవారు భక్తులు. మీకు ప్రపంచం మీద ఉన్న వ్యామోహాన్ని నేను తినేస్తాను, ఆ బాధ్యత నాది అనేవారు రామకృష్ణుడు, వాడు గురువు అంటే. గణపతిని మట్టితో చేసి పూజించి తరువాత నీటిలో కలుపుతారు. అంటే సాకారం నిరాకారంలోనికి వెళుతోంది. మనం మంచిగుణాలను సంపాదించుకొని గుణాతీత స్థితికి వెళ్ళాలి. సగుణంలో నుండి నిర్గుణంలోనికి వెళ్ళాలి, సాకారంలో నుండి నిరాకారంలోనికి వెళ్ళాలి. మన శరీరం మట్టితో తయారయ్యింది, అది ఏదో రోజున మట్టిలో కలిసిపోతుంది. అది పోయినప్పుడు మనం పోము, ఎప్పుడూ ఉండే వస్తువే మనం, అది గ్రహించటమే

ఆత్మజ్ఞానం. సంకల్పాలు, రాగద్వేషాలు, పునర్జన్మ కారణాలు మొత్తం పెంట అంతా మనస్సులో ఉంది, అమనస్కస్థితి కలిగేవరకూ ఎవడికి ఆత్మజ్ఞానం కలుగదు. కొంతమంది వారికి ఉన్న తెలివితో తాదాత్మ్యం పొందుతారు, ఆ తెలివితేటలు మనం కాదు, అవి కూడా భగవంతుడు మనకు ఇచ్చినవే. వారిని మేము ఉద్ధరించాము అని కొంతమంది చెపుతూ ఉంటారు, మనం ఎవరము వారిని ఉద్ధరించటానికి, ఉన్నది ఈశ్వరుడే. ఈశ్వరుడికి భిన్నంగా మనం లేము, ఆయనకు భిన్నంగా ఉన్నాము అనుకోవటం వలననే ఈశ్వరుడికి దూరమయిపోతున్నాము. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం లేని వాడికి అసలు ఆత్మజ్ఞానం రాదు. భోగప్రవృత్తి, ప్రపంచంలో ఉన్న వస్తువులను ఎంజాయ్ చేయాలనుకోవటం, కృత్రిమగౌరవాలకోసం, పేరు ప్రఖ్యాతుల కోసం ఎదురుచూడటం, వీటికంటే ఎండ్రిన్ మెరుగు. మనం సత్కర్మ చేయాలి, అది కూడా నిష్కామంగా చేయాలి, ఈశ్వరప్రీత్యర్థం చేయాలి. గౌరవాల కోసం చేస్తే గౌరవం వస్తుంది కాలప్రవాహంలో కొట్టుకొని పోతుంది, ఈశ్వరప్రీత్యర్థం చేస్తే ఈశ్వరానుభవం కలుగుతుంది. మనకు శాంతి లేనప్పడు, సుఖం లేనప్పడు ఈ గౌరవాలను ఏమి చేసుకొంటాము. మీకు శాంతి లేదు అనుకోండి మీరు గొప్పవారు అని చెప్పకొంటే ఆ మాటల వలన ప్రయోజనం ఏమిటి? మీకు అనుకూలమైన మాటలు చెపుతూ ఉంటే మీ మనస్సు పొంగిపోతూ ఉంటుంది, మీకు ఆనందం వస్తూ ఉంటుంది, అది ఒక రకమైన భోగప్రవృత్తి. భగవాన్ ఒకమాట చెప్పారు సినిమా మొదలు పెట్టాక లైట్లు అన్నీ ఆర్పేస్తారు, అప్పడు తెరమీద బొమ్మలు అవి కనిపిస్తాయి, ఒక్కసారి హాలులో లైట్లు అన్నీ వేశాము అనుకోండి ఇంక తెరమీద బొమ్మలు నీకు కనబడవు. అలాగే చిన్నచిన్న మనస్సులతో, బుద్ధితో చూసేవాడికి ఈ నామరూపములు, ప్రపంచం గాని ఆత్మజ్ఞానం అనే మహావెలుగులో చూసిన వాడికి నామరూపములు లేవు, అసలు ఈ సృష్టే లేదు. మనస్సుతో చూడటం వలన అశాంతి వస్తోంది, ఆత్మతో చూస్తే అశాంతి లేదు ఉన్నది శాంతే. ఉన్నది శాంతి, నీవు కల్పించుకొన్నది అశాంతి, ఉన్నది చావులేని స్థితి, నీవు కల్పించుకొన్నది చావు. ఈ విషయం నోటితో చెప్పకొంటే సరిపోదు, అది అనుభవంలోనికి వచ్చినప్పడు మనకు తెలుస్తుంది.

సాధన ఎలా చేసుకోవాలి అని భగవాన్‌ను అడిగితే నీకు ఇష్టమైన రూపాన్ని ధ్యానం చేసుకో, ఆ నామాన్ని స్మరించుకో, శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యి. అలా చేయగా చేయగా శాస్త్రంలో చెప్పిన మాటలు నీవు సొంతంగా అనుభవిస్తావు, అది స్వానుభవం. నీవు చెయ్యగలిగితే సత్కర్మ చెయ్యి, సత్పురుషులతో సహవాసం చెయ్యి. నువ్వు అశాంతిగా ఉంటున్నావా అని ఒకసారి రామకృష్ణుడు నరేన్‌ను అడిగాడు 'నాకు పుస్తకాలు చదివినా,

గుడికి వెళ్ళినా శాంతి రావటం లేదు, సత్పురుషుల సమక్షంలో శాంతి కలుగుతోంది' అని నరేన్ చెప్పాడు. ఎంత బాగా చెప్పావు, ఎంత అందంగా చెప్పావు నరేన్ అన్నాడు రామకృష్ణుడు. నీవు సత్కర్మ చేసినా ఆడంబరంగా చేయకూడదు, నిరాడంబరంగా చేయాలి. కృష్ణార్పణంగా చేయాలి, అలా చేయటం వలన నీవు శుద్ధుడవు అవుతావు. నీవు పరిశుద్ధుడవు అయితేగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. నోటితో ఎలా దేవుడిని ప్రార్థిస్తున్నామో అలాగ చేతులతో కూడా ప్రార్థించాలి. మదర్‌థెరిసా రూములో ఏసుక్రీస్తును శిలువ వేసిన ఫొటో ఉండేది. ఓ ప్రభువా! నీవు మాకోసం ఎంత కష్టపడ్డావో, మేము కూడా ఇబ్బంది పడేవారికోసం అంత కష్టపడాలి కదా. చర్చిలు సమాజానికి ఎంతో కొంత ఉపయోగపడతాయి, పాడైపోయిన వారిని చేరతీసి వారికి సహాయం చేస్తారు.

కర్మను యోగంగా చేసేవాడు కర్మయోగి, కర్మ ఫలితం భోగించాలనుకొనేవాడు కర్మభోగి. మనం కర్మయోగులం కాదు, కర్మ భోగులం. ఈ దేహమే ఆత్మ అనే బుద్ధి మనకు ఉంది. మనకు ఉన్న ఉపాసన, మనం చేసే కర్మ, మన వివేకం ఇవి అన్నీ కూడా దేహం మీద మనకు ఉన్న ఆత్మబుద్ధిని తగ్గించాలి. అంజనం అంటే మాయ, ఈశ్వరుడు నిరంజనుడు అంటే మాయలేనివాడు. మీరు పూజ చేయండి, జపం చేయండి, ధ్యానం చేయండి, వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఒక్కటే, మన మనస్సులో ఉన్న బలహీనతలు పోవాలి. మనకు దేహం యందు ఆత్మబుద్ధి ఉన్నంతకాలం దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది. మీ హృదయంలో ఉన్న శాంతి మీకు అందుతూ ఉంటే మనస్సుకు బాహ్యప్రవృత్తి ఆగిపోతుంది. ఎండ్రిన్ తాగితే చనిపోతాము అని మనకు తెలుసు కాబట్టి ఎండ్రిన్ ఎవరైనా ఇచ్చినా మనం తాగము. అలాగే విషయాలలో ఉన్న దోషం మన బుద్ధికి అర్థమైతే విషయాలకు దూరంగా ఉంటాము. మనం భక్తిమార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞానమార్గంలో ప్రయాణం చేసినా ఏదైతే మనం నేను నేను అంటున్నామో ఆ నేను యొక్క విజృంభణ తగ్గించుకోవాలి. కర్మ జడమే కాని కర్మకు ఫలితం ఇచ్చేవాడు ఒకడు ఉన్నాడు, కర్మను సఫలీకృతం చేసేవాడు ఒకడు ఉన్నాడు, వాడే నారాయణుడు. ప్రాపంచిక జ్వరం ఉన్నవాడికి సమాధిస్థితి ఎలా కలుగుతుంది. ఆ ప్రాపంచికబుద్ధిని తినేసేవాడిని నేను ఉన్నాను కదా, ఆ బుద్ధిని తింటే కదా నీకు సమాధిస్థితి కలిగేది అంటున్నాడు రామకృష్ణుడు. గౌడపాదుడు ఏమిచెపుతున్నాడు అంటే మిమ్మల్ని ఎవరైనా పొగిడితే సంతోషం వస్తోంది, ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖం వస్తోంది. ఈ పొగడ్తలు, విమర్శలు నిజం అనుకోవటం వలన మీకు వికారాలు వస్తున్నాయి. అవి నిజంకాదు అని మీ బుద్ధికి అందినప్పడు మీకు వికారం లేదు. మీకంటే డబ్బు ఉన్న వారిని, గౌరవం ఉన్న వారిని చూస్తే మీకు అసూయ కలుగుతోంది, అవి నిజం అనుకోవటం

వలన అసూయ వస్తోంది, అవి నిజం కాదు అని తెలిస్తే అసూయ లేదు.

మీరు ఏ పని చేసినా వ్యాపారధోరణితో చేస్తే వ్యక్తిభావన నశించదు, దేహభావనలో నుండి బయటకు రాలేరు. పని చెయ్యి, ఫలితం కోసం ఎదురు చూడవద్దు. ఫలితం కోసం ఆశించకుండా ఉంటే, ఎదురుచూడకుండా ఉంటే నీకు ఆశాభంగం లేదు, వచ్చేది ఏదో వస్తుంది. రాగద్వేషములు తగ్గుతూ ఉంటే మనోచాపల్యం తగ్గిపోతూ ఉంటుంది. ఇప్పుడు మనం అసహజస్థితిలో ఉన్నాము కాబట్టి అశాంతి, దుఃఖం వస్తోంది. మనకు సహజస్థితి కలిగితే ఈ దేహం ఉండటానికి, దేహం లేకపోవటానికి బేధం తెలియదు. దేహం ఉన్నా దేహం లేకపోయినా మనం ఉంటాము అన్న సంగతి మనకు తెలుస్తుంది. ఏది సత్యం, ఏది అసత్యం అనే విభజన మనకు తెలియాలి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇది మీ బుద్ధికి అందాలి. మీరు ఒక మంచి పని చేయాలి అనుకొన్నారు అనుకోండి, మీకు వయస్సు 90 సంవత్సరాలు అనుకోండి, ఇంత వయస్సు వచ్చాక ఎందుకు అనుకోవద్దు, అప్పుడయినా మంచి పని చేయండి. ఇప్పటివరకు మీకు ఈశ్వరుడి మీద నమ్మకం లేదు అనుకోండి, ఇంక ఇప్పుడు ఎందుకు అనుకోవద్దు, లేటుగా అయినా ఈశ్వరుడిని విశ్వసించండి. మీరు గుర్తింపులు కోరుకోవద్దు, గుర్తింపులు విషంతో సమానం, గుర్తింపులు కోరుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. మన శరీరం ఒక మట్టి ముద్ద, దానికి ఒక పేరు వస్తోంది. ఆ మట్టి ముద్ద తోటి, ఆ పేరు తోటి మనకు తాదాత్మ్యం ఉన్నంత కాలం, వాటితో కలిసి జీవిస్తున్నంతకాలం మనం ఏమి చేసినా, ఎంత సాధన చేసినా ఒకటి లేని సున్నలతో సమానము. ఆ రూపం, నామం తాను కాదని తెలుసుకొనే వరకూ వాడికి జ్ఞానం కలుగదు.

ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మీమీద మీకు నమ్మకం లేకపోతే మీరు ఎంతమంది దేవతలను ఆరాధించినా మీకు జ్ఞానం కలుగదు. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, అశాంతి వస్తోంది అనుకోండి, అది అంతా కల్పితమే, అది రూపభావనలో నుండి, నామభావనలోనుండి వస్తోంది. ఈశ్వర ప్రణాళిక ప్రకారం దేహయాత్ర జరిగిపోతుంది అని చెపుతున్నారు, ఇంక సాధన ఎందుకు అని అడుగుతున్నారు. నువ్వు సాధన చేసి ఈశ్వరుని దయకు పాత్రుడవు అయినప్పుడు ప్రారబ్ధం యొక్క ప్రభావం అసలు నీమీద పడదు, శరీరం ద్వారా జరిగే సంఘటనలు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి వేగం నీ మీద పడదు. సూర్యుడు యొక్క వేడి ఎంత ఎక్కువగా ఉన్నా నువ్వు ఏసి గదిలో ఉంటే ఆ వేడి నిన్ను ఏమీ చేయలేదు, అదేవిధంగా నీవు హృదయంలో ఉన్నప్పుడు బాహ్యపరిస్థితులు ఎలాఉన్నా వాటి ప్రభావం నిన్ను అంటదు. నీకు ఈశ్వరుడి పట్ల పరిపూర్ణమైన విశ్వాసం

ఉంటే అహంభావన నశిస్తుంది. విశ్వాసం లేనప్పడు విచారణా మార్గంలో కూడా దేహగతమైన నేను నశిస్తుంది. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహగతమైన నేనులోనుండి విడుదలపొందటమే మన గమ్యం. నీవు ఏ పని చేస్తున్నా త్రికరణశుద్ధితో చేయాలి, ప్రేమభావన ఉండాలి, భక్తిభావన ఉండాలి. అలా పనిచేస్తూ ఉంటే ఈ శరీరం ఉండగానే అమృత పదవిని పొందుతావు. రామకృష్ణుడు శరీరం విడిచిపెట్టేస్తున్నాడు, అందరూ కూర్చున్నారు, నరేన్ కూడా అక్కడే ఉన్నాడు, నీకు ఏమి కావాలి అని నరేన్‌ను అడిగితే సమాధిస్థితి ఇవ్వండి చాలు అంటాడు. నీది అంత చిన్న మనస్సు కాదు, నీవు ప్రపంచానికి బోధిస్తావు అంటాడు రామకృష్ణుడు. ముందు నన్ను బాగుపడ నివ్వండి అంటాడు నరేన్. నీకు బోధ చేయటం ఇష్టం లేకపోయినా, నీ లోపలఉన్న ఎముకలు బోధిస్తాయి అంటాడు రామకృష్ణుడు. మీకు బలహీనతలు ఉన్నాయి అని కంగారు పడవద్దు. వాటిలోనుండి బయటకు రావటానికి మీరు చేసే ప్రయత్నం మీరు చేయండి, ఆ బలహీనతలను నేను తింటాను అనేవాడు రామకృష్ణుడు.

మనం భగవంతుడి మీద భారం వేయాలి కాని ఎంతభారం వేసినా మోయటానికి ఆయన సిద్ధంగా ఉంటాడు. మనకు భయం ఎందుకు వస్తోంది అంటే, అశాంతి ఎందుకు వస్తోంది అంటే మనం ఏదో ఊహించుకొంటూ ఉంటాము, అలా ఊహించుకోవటం వలన భయం వస్తుంది, అశాంతి వస్తుంది. ఈశ్వరుడి మీద భారం వేసినవాడికి ఇంక ఊహలు రావు, సంకల్పాలు రావు. మనం భగవంతుడిని పూజించటం ఎందుకు అంటే ఉపాసనాబలం లేకుండా మోక్షం కలుగదు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళేటప్పడు లక్ష్మణుడితో నీవు నాకూడా రావద్దు, ఇక్కడ ఉన్న భోగాలు వదులుకొని అరణ్యవాసానికి ఎందుకు? అంటాడు. అప్పడు లక్ష్మణుడు ఏమి చెప్పాడు అంటే అయోధ్యలో భోగాలు ఉన్నమాట నిజమే, కాని అక్కడ నీ పాదాలు ఉండవు. నీ పాదాలు ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాను అని చెప్పాడు, వాడికి మోక్షం రాకుండా ఎలా ఉంటుంది. అందరిలోను అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు, ప్రారబ్ధం ననుసరించి ఈ జీవులను ఆడిస్తున్నాడు కాని ఆయన మనకు తెలియటం లేదు, తెలియని విషయం వదిలివేయండి. మీకు నేను అనే తలంపు, నాది అనే తలంపు రెండూ తెలుస్తున్నాయి కదా. మీకు తెలిసిన నేను, నాది అనే తలంపుల నుండి బయటకు రండి, అప్పడు మీకు ఏదైతే తెలియటం లేదు అనుకొంటున్నారో అది తెలియబడుతుంది. మనం కృష్ణుడి రూపాన్ని చూస్తున్నాము అనుకోండి, ఆయన ఆ రూపంలో ఉన్నాడు, అంతటా ఉన్నాడు. అంతటా ఉన్న వాడిని మనం చూడలేము, ఆ రూపంలో ఉన్న కృష్ణుడిని చూస్తున్నాము అంతే. నీవు ఎవరిని చూసినా ఆ రూపాన్ని చూడవద్దు, వాడి మనస్సును చూడవద్దు, వాడిలో ఉన్న ఈశ్వరుడిని చూడు, నీకు వికారాలు రావు. ఈశ్వరుడు అంతర్యామిగా లేకుండా

జంతుశరీరంగాని, మానవశరీరం గాని, ఏ శరీరం గాని ఈ సృష్టిలోనికి రాదు. దేవుడు లేడని చెప్పేవాడు ఉండవచ్చు కాని మీరు ధర్మంగా ఉండవద్దు, మంచిగా ఉండవద్దు అని ఎవరూ చెప్పరు అంటే వాడు ధర్మాన్ని, మంచిని అంగీకరిస్తున్నాడు కాని ఈశ్వరుడిని అంగీకరించటం లేదు. ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన ఈ ధర్మానికి, మంచికి, పుణ్యపాపాలకు, ఈ సృష్టికి అతీతుడు. మనందరం శివపూజ చేయాలి అనుకొంటున్నాము, నోటితో చెప్పేది శివపూజ కాని ఆచరణలో చేసేది శవపూజ. ఎవడి శవాన్ని చూసి వాడు మురిసిపోతున్నాడు, మనం తొడుక్కొనే చెప్పలు విలువ కూడా ఆ శవానికి ఉండదు, అది మర్చిపోతున్నాడు. గాంధీగారు దేశ స్వాతంత్ర్యం కోసం చాలా కష్టపడ్డారు. ఆయన ఎప్పడూ స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అనేవారు, హరిజనులను ఉద్ధరించాలి అనేవారు, ఖద్దరు ఖద్దరు అనేవారు. సత్యాగ్రహాల గురించి చెప్పేవారు ఇలా ఎన్నో గొడవలు కాని ఆయన మరణసమయంలో హేరామ్, హేరామ్, హేరామ్ అన్నారు. అంటే ఆయన డ్యూటీ ఏదో ఆయన చేసేసాడు. ఆయన హృదయంలో ఉన్నది ఈ గొడవలు ఏమీ కాదు, ఆయన హృదయంలో ఉన్నది రాముడే. అందుచేతనే మరణసమయంలో ఆయనకు ఈ గొడవలు ఏమీ రాలేదు, ఆయన హృదయంలో ఏదైతే ఉందో అదే వచ్చింది, మరణసమయంలో హేరామ్, హేరామ్, హేరామ్ అన్నాడు. ఆయన మహాత్ముడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-06, ఐ-భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇక్కడ వేదపాఠశాల నిర్మించటం ఈ ప్రాంతంవారికి వేదం చదువుకోవటానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పూర్వం మహారాజులు వేదాన్ని పోషించేవారు. ఇప్పడు ప్రజలే పోషించుకోవాలి. వేదంలో చాలా భాగాలు ఉంటాయి. ప్రపంచంలో లేనిది వేదంలో ఉంది కాని వేదంలో లేనిది ప్రపంచంలో లేదు. వేదాన్ని అందరు పారాయణం చేసుకోవటానికి వీలుగా వ్యాసుడు దీనిని నాలుగు భాగాలుగా విభజించాడు. ఈ కలియుగంలో వేదాన్ని అర్థం చేసుకోవటం కష్టం. వేదాన్ని పారాయణ చెయ్యటం వేరు, దానిని అర్థం చేసుకొని ఇతరులకు వివరించటం వేరు. వేదాన్ని చదివేటప్పడు అది మనకు అర్థమైనా, కాకపోయినా ఆ స్వరాన్ని మనం శ్రవణం చేసినా అంతఃకరణశుద్ధి కలుగుతుంది. వేదాన్ని స్వరబద్ధంగా పారాయణ చెయ్యాలి. అవి ఋషుల యొక్క అభిప్రాయాలు అంటే ఏదో ఊహించి, బుద్ధితో ఆలోచించి చెప్పిన విషయాలు కాదు. వారు సమాధిస్థితిలో ఉన్నప్పడు దైవవాణి అంటే పరబ్రహ్మం చెప్పిన మాటలు విని వాటిని క్రోఢీకరించారు కాని బుద్ధితో ఆలోచించి వ్రాసినవి కాదు. అందుచేత

వేదంలో చెప్పిన మాటలు యుగాలు మారినా ఇప్పటికీ సత్యంగా ఆ మాటలు చెల్లుబాటు అవుతున్నాయి. అవి తాత్కాలిక ప్రయోజనాలు ఆశించి చెప్పినవి కాదు, వారు సత్యాన్ని దర్శించి మానవజాతిపట్ల ప్రేమతో, దయతో చెప్పిన మాటలు. చాలామంది ఏమనుకొంటారు అంటే వేదంలో ఒక్క భక్తి గురించే చెప్పారు, జ్ఞానం గురించే చెప్పారు అనుకొంటారు. వేదంలో ఖగోళం గురించి, జ్యోతిష్యం గురించి, సైన్సు గురించి, మనిషి తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్లేవరకు ఏ వయస్సులో వాడు ఎలా ప్రవర్తించాలి, కర్మకాండ ఏరకంగా చెయ్యాలి సమస్తం వేదంలో వివరంగా చెప్పారు. వేదంలో లేనిది అంటూ ఏదీ లేదు. వేదాలలో కర్మకాండ గురించి, ఉపాసన గురించి, భక్తి గురించి, చివరలో జ్ఞానం గురించి చెప్పారు. మంచికర్మలకు ఎటువంటి ఫలితాలు ఉంటాయి, చెడుకర్మలకు ఎటువంటి ఫలితాలు ఉంటాయి, మానవ జీవితానికి సంబంధించిన అన్ని విషయాలు కూడా వేదంలో చెప్పబడ్డాయి. వేదాలను అర్థం చేసుకోవటం కష్టం కాబట్టి ఆ వేదాల సారాన్ని వ్యాసుడు మహాభారతం కింద వ్రాసాడు, మహాభారతాన్ని పంచమ వేదం అంటారు. మనం మహాభారతాన్ని చదివి అర్థం చేసుకొంటే నాలుగు వేదాలు చదివినట్లు అవుతుంది. ఆదికావ్యం వ్రాసిన వాల్మీకిని, వేదాలు విభజించిన వ్యాసుడిని మనం మర్చిపోకూడదు, మన భారతీయ సంస్కృతికి మూలపురుషులు అయిన ఆ మహాత్ముల పట్ల మనం కృతజ్ఞత కలిగి ఉండాలి. వేదాలలో అంతిమభాగంలో ఉపనిషత్‌లలో జ్ఞానం గురించి చెప్పారు.

వేదాలలో చెప్పిన అన్ని విషయాలను సమన్వయం చేసుకొంటూ వెళ్ళాలి. నేను కర్మకాండ వదిలేస్తాను, భక్తి వదిలేస్తాను, ఉపాసన వదిలేస్తాను, జపధ్యానములు చెయ్యను, నాకు ఆత్మజ్ఞానం వచ్చేయాలి అంటే అసలు అలా రాదు. దానికి ఫౌండేషన్ ఉండాలి కదా. ఫౌండేషన్ లేకుండా బిల్డింగ్ కడితే నిలబడుతుందా? నేను ఆత్మజ్ఞానం గురించి శ్రవణం చేస్తున్నాను ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది అని అనుకోకూడదు. కృష్ణా, రామా అంటూ జపం చేస్తున్నాను అంటే అలాకాదు. నీ డ్యూటీ నీవు శ్రద్ధగా చెయ్యాలి, నీవు ధర్మం నిర్వర్తించాలి, యోగాలన్నింటిని సమన్వయం చేసుకొంటూ నీవు ప్రయాణం చెయ్యాలి. భక్తి యోగం, జ్ఞానయోగం ఇవి పరస్పర విరోధాలు కావు, అవి పరస్పరం సహకరించుకొనేవే. మన జీవితానికి కర్మకాండ అవసరం, ఉపాసన అవసరం, జపధ్యానములు అవసరం, ఇవన్నీ దాటిన తరువాత ఆత్మజ్ఞానం. మనం ఏమి చేస్తున్నాము అంటే పునాది అంతా వదిలేసి చివరను పట్టుకొని వేలాడదాము అంటే చెట్టు రొబ్బ మీద పడుకొనేవాడికి ఏ గతి పడుతుందో మనకు అదే గతి పడుతుంది. మనం చెట్టు రొబ్బ మీద పడుకోవచ్చు కాని ఎంతసేపు పడుకొంటాము ఎటువైపు దొర్లినా కింద పడిపోతాము, మన పరిస్థితి కూడా అలాగే ఉంది. అందుచేత మనం అన్నీ సమన్వయం చేసుకోవాలి.

కర్మను యోగంగా చేస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. మనిషి ఏదైనా ఒక పని చేస్తే ఆ పని తాలుక ఫలితం భోగించాలని వాడికి ఉంటుంది, భోగప్రవృత్తిలో నుండి పునర్జన్మలు వస్తాయి. ఒక మనిషి వాడు ఏ కులస్థుడైనా, ఏ మతస్థుడైనా దేహాభిమానం, ధనాభిమానం, విద్యాభిమానం, ప్రాంతీయాభిమానం, కులాభిమానం ఇలా అభిమానాలు ఉన్నవాడికి ఎవడికీ అంతఃకరణ శుద్ధిరాదు. అంతఃకరణశుద్ధి లేనివాడికి ఆత్మజ్ఞానం రాదు.

కృష్ణుడు స్వయంగా భగవంతుడు అయినప్పటికీ, నేను చెప్పే జ్ఞానం అంతా పూర్వ నుండి ఉన్నదే, ఫలానావారు దీని గురించి చెప్పారు, ఇప్పుడు నేను నీకు ఎందుకు చెపుతున్నాను అంటే పూర్వం ఇది లేదని కాదు, కాలప్రవాహంలో ఇది మరుగున పడిపోయింది అందుకు నేను మరల చెప్పవలసి వస్తోంది అంతేగాని ఇది నేను ఆలోచించిగాని, కల్పించిగాని చెప్పటం లేదు అని భగవంతుడు చెప్పాడు. కొంతమంది మాకు అహంకారం లేదు అని అంటారు, అదొక రకమైన అహంకారము. మాకు గర్వం లేదని కొంతమంది అంటారు, అది కూడా గర్వమే. గర్వం లేనివాడు ఎవడు నాకు గర్వం లేదని చెప్పడు. మానవప్రవృత్తి గురించి వేదంలో ఏమని చెప్పారంటే కొంతమంది అకారణంగా ఇతరులను నిందిస్తారు, ఇతరులను హింసపెడతారు, తమోగుణం ఉన్న మనుషులు అలా ప్రవర్తిస్తూ ఉంటారు. కొంతమంది వారికి అపకారం చేస్తే తిరిగి అపకారం చేస్తారు. వారు చేస్తే వీరు తిరిగి చేస్తారు గాని లేకపోతే చెయ్యరు, రజోగుణం యొక్క లక్షణాలు అలా ఉంటాయి అని వేదంలో చెప్పారు. సత్వగుణం ఉన్న మనుషులు ఎలా ఉంటారు అంటే వారికి ఎవరైనా అపకారం చేసినా సహిస్తారు, వారి మార్గాన్ని విడిచిపెట్టరు. వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని వీడు దారి తప్పడు. సత్వగుణం మోక్షానికి దారి చూపిస్తుంది కాబట్టి సత్వగుణాన్ని ప్రాక్టీసు చెయ్యమని మన పెద్దలు చెప్పారు. ఎవరి పని వారు శ్రద్ధగా చేసుకోండి, కర్మకు దూరం అవ్వవద్దు. మీరు చేసే కర్మలో భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి. నీ పని నీవు చేసుకొంటూ కర్మ ఫలాన్ని త్యాగం చేస్తూ ఉంటే నీవు పవిత్రుడవు అవుతావు. త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు. నీకు భక్తి ఉందని నీవు చేస్తున్న పనిని విడిచిపెట్టవద్దు, పనిలో దేవుడిని చూడు, పని ద్వారా దేవుడిని ఆరాధించు. గీతను అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకొంటే జననమరణ చక్రం నుండి విడుదల పొందుతావు. భజగోవింద శ్లోకాలలో ఆచార్యులవారు ఏమని చెప్పారు అంటే నీకు వయస్సు వచ్చి మీద పడుతోంది, గోవిందుని ఆరాధించుకో, ఆయన నామాన్ని స్మరించుకో, అవకాశం ఉంటే గంగాజలాన్ని పానం చెయ్యి, నీకు ఏమైనా కలిగి ఉంటే దీనజనులకు కొంత పెట్టుకో అని చెప్పారు. నీ మాటలో, చేతలో, వ్యవహారంలో ఎప్పుడూ అవినయం రాకుండా చూసుకో. అవినయం ఉన్న వాడికి ఆత్మజ్ఞానం రాదు. నాకు ఉన్నది ఇతరులకు ఇవ్వగలనుగాని నాకు

లేనిది ఇతరులకు ఇవ్వలేను. నేను లోపల గర్వం పెట్టుకొని మీకు వినయం ఎలా నేర్పగలను, గర్వమే నేర్పుతాను. ముందు నీవు పొందవలసింది ఏదో పొందు. నువ్వు ప్రాక్టీసు చేసి ఇతరులకు చెప్పు. నువ్వు ప్రాక్టీసు చేయకుండా ఇతరులకు చెప్పినా దాని ప్రభావం వారిమీద ఉండదు అని బాపూజీ చెప్పారు. మన శరీరం పంచ భూతాలతో తయారయ్యింది, ఇవి పరస్పరం సహకరించుకొంటాయి కాని విరోధంగా లేవు. అలాగే నువ్వు భక్తియోగాన్ని, కర్మయోగాన్ని, జ్ఞానయోగాన్ని సమన్వయం చేసుకొని నువ్వు పొందవలసింది పొందు.

గాంధీగారిని ఒకరు అడిగారు మీకు చాలామంది అనుచరులు ఉన్నారు కదా, మీకు ఎవరంటే బాగా ఇష్టం అని అడిగారు. పటేల్‌గారి పేరు, నెహ్రూగారి పేరు చెపుతారని చాలామంది అనుకొన్నారు. కాని రాజేంద్రప్రసాద్ అంటే నాకు చాలా ఇష్టం అని గాంధీగారు చెప్పారు, ఎందుకు ఆయన అంటే ఇష్టమో కూడా చెప్పారు. ఒక కప్పులో విషం పోసి, ఇది విషం మీరు పానం చెయ్యండి అని చెపితే నాకూడా తిరిగే వాడు ఎవడూ పానం చెయ్యడు. బాపూజీ నాకు ఈ విషాన్ని ఎందుకు ఇస్తున్నారు అని ప్రశ్నించకుండా ఆ విషాన్ని పాయసంలాగ పానం చేసేవాడు ఒక్క రాజన్‌బాబు మాత్రమే అందుకే ఆయన నా హృదయానికి అత్యంత సన్నిహితుడు అని గాంధీగారు చెప్పారు. కొంతమంది ఈశ్వరుడికి విశ్వాసపాత్రులు ఉంటారు, ఆయన ఎలాగ చెపితే అలాగ ఆచరిస్తారు. ఆయన అవును అంటే అవును, కాదు అంటే కాదు అంటారు, మధ్యలో వీడిబుద్ధిని అక్కడ పెట్టడు. మనం గీత చదువుతున్నాము అనుకోండి, భగవంతుడు చెప్పిన వాక్యం మన బుద్ధికి నచ్చలేదు అనుకోండి అప్పడు మన బుద్ధిని ఒక ప్రక్కన పెట్టి, భగవంతుడు చెప్పిన వాక్యాన్ని విశ్వసించటం నేర్చుకోవాలి. ఉన్నవాడు ఈశ్వరుడు ఒక్కడే, మనం ఎక్కడ ఉన్నాము, ఉన్నవాడు ఆయనే మనం లేము. ఈ పొట్టి వాక్యం మీకు అర్థమైతే మీరు చేసే యోగాభ్యాసాలతో సంబంధం లేకుండా మీరు దుఃఖరహితస్థితిని పొందుతారు. ఉన్నవాడు ఆయన ఒక్కడే, మనం లేము అని నోటితో చెపితేకాదు, అది మన గుండెకు పట్టాలి, అప్పడు దుఃఖం నశిస్తుంది. భారతయుద్ధ ప్రారంభంలో అర్జునుడు అంటాడు వీరు అందరూ నాకు గురువులు, బంధువులు వీరిని ఎలాగ చంపటం అని ఆయనకు మోహం కలిగింది, మోహంలో నుండి ఈ ప్రశ్నలు అన్నీ వచ్చాయి. అందుచేతనే కృష్ణుడు గీత అంతా చెప్పి చివరలో నీకు మోహం నశించిందా అని అర్జునుడితో అంటాడు. మోహం ఉన్నవాడికి లేనిది ఉన్నట్లుగా, ఉన్నది లేనట్లుగా, సత్యం అసత్యంలాగ, అసత్యం సత్యంలాగ కనిపిస్తుంది. మీ మీద నాకు అసూయ ఉంది అనుకోండి, మీలో ఉన్న ఔన్నత్యం నాకు కనబడదు. 1920వ సంవత్సరం ఆ ప్రాంతంలో గాంధీగారు ఆయన భార్యకు ఒక లెటరు వ్రాసారు, ఆ లెటరు సేవాగ్రామ్‌లో ఫొటో కట్టించి పెట్టారు, ఆ ఉత్తరం చదివితే మీరు ఇంకేమీ చదవనక్కరలేదు. నాలుగు వేదాల

సారం అందులో ఉంది. గాంధీగారు దక్షిణాఫ్రికాలో ఉండగా ఆయన భార్యకు ఇక్కడ జబ్బు చేసింది. ఆవిడ చనిపోతారు అని డాక్టర్లు చెప్పారు. ఆవిడ ఎంతోకాలం జీవించరు అందుచేత మీరు వెంటనే వచ్చి చూసి వెళ్ళటం మంచిది అని డాక్టర్లు గాంధీగారికి లెటరు వ్రాసారు. అప్పుడు గాంధీగారు భార్యకు ఒక లెటరు వ్రాసారు. "ఇక్కడ నేను పనిలో ఉన్నాను, వెంటనే ఇండియాకు రాలేకపోవచ్చు. ఒకవేళ వచ్చేలోపు నీ శరీరం మరణించవచ్చు. బాపూజీ దగ్గరలేరు, వారు దగ్గర లేరు, వీరు దగ్గర లేరు ఆ సమస్యలు వద్దు, వీటి గురించి ఆలోచిస్తూ ఉంటే ఈలోపు శరీరం మరణిస్తుంది. శరీరం మరణించినా మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. నీ శరీరానికి మరణం రాకముందే దానిని నీవు ఎరుకలోనికి తెచ్చుకోగలిగితే ఈ దేహం ఉన్నా, దేహం పోయినా మనం ఉంటాము అనే అనుభవం నీకు వస్తుంది, ఆ స్థితిని పొందటానికి ప్రయత్నం చెయ్యి" అని వ్రాసారు.

మన హృదయంలో ఉన్న ఈశ్వరుడిని వదిలేసి ఏదో తెలుసుకొన్నాను అంటే నీవు ఏది తెలుసుకొన్నా అది కాలప్రవాహంలో పోతుంది. మీకు లక్ష వేల కోట్ల డబ్బు ఉంది అనుకోండి. ఆ డబ్బు ఉన్నప్పుడు ఇది ఎక్కడికి పోతుంది అని మనకు అనిపిస్తుంది. కాల ప్రవాహంలో ప్రతీది కొట్టుకొనిపోతుంది, పెద్ద సామ్రాజ్యాలే కొట్టుకొనిపోయాయి. నీవు అమృతానుభవం పొందితే అది నిజం కాబట్టి అది ఒక్కటే స్థిరంగా ఉంటుంది. మా మనస్సు చాలా బాధపెడుతోంది, శరీరానికి వచ్చిన అనారోగ్యం తట్టుకొంటున్నాము కాని మనస్సులో వచ్చిన అశాంతిని తట్టుకోలేకపోతున్నాము అని అడుగుతున్నారు. అసలు మనస్సు అంటేనే పెంట. రాగద్వేషాలు, అసూయ, దుఃఖం, అశాంతి అన్నీ మనస్సులో ఉన్నాయి. పెంటమీద కూర్చుని చెడువాసన వస్తోంది అనుకోవటం ఎటువంటిదో మనస్సు చుట్టూ తిరుగుతూ అశాంతి వస్తోంది అనుకోవటం అటువంటిదే. దూడ పచ్చగడ్డి తింటోంది అనుకోండి, దాని మనస్సు వట్టిగడ్డి మీదకు వెళ్ళదు. అలాగే హృదయంలో ఉన్న సుఖం నీవు అనుభవిస్తూ ఉంటే మనస్సుకు చాపల్యం తగ్గిపోతుంది, అశాంతి కూడా తగ్గిపోతుంది.

మనం పదార్థ జ్ఞానంతో సరిపెట్టుకొంటున్నాము కాని పరమాత్మజ్ఞానం దగ్గరకు, ఆత్మజ్ఞానం దగ్గరకు రావటం లేదు. పదార్థజ్ఞానం కూడా జ్ఞానమే, అది ఎంత పెరిగినా అశాంతే కాని నీకు శాంతి రాదు. పరమాత్మజ్ఞానంలోనే శాంతి, ఆనందం ఉంది. పదార్థజ్ఞానం అంతా సైన్సుకు సంబంధించినది, దాని వలన దేహానికి కంఫర్ట్సు పెరుగుతాయి, దాని ప్రయోజనం దానికి ఉంది కాని, దాని వలన శాంతి, ఆనందం రాదు. ఉన్నవాడు ఈశ్వరుడు ఒక్కడేకాని ఆయన ఉన్నాడు, మనం కూడా ఉన్నాము అనుకోవటం వలన మనకు అశాంతి వస్తోంది. నమ్మాళ్వార్ అంటాడు ఓ పెరుమాళ్ళూ నిన్ను అనేక జన్మలనుండి ఆరాధిస్తున్నాను,

నీవు వేరు నేను వేరు అనుకొంటున్నాను. నిన్ను తెలుసుకొన్నాక తెలిసింది, నేను అంటూ అసలు లేను నువ్వే ఉన్నావని తెలిసింది, అప్పడు జీవుడు దుఃఖరహితస్థితికి వెళ్ళిపోతాడు. అక్కడ జీవుడు అంటూ ప్రత్యేకంగా ఉండడు. ఆయన సంకల్పమే ఈయన సంకల్పం, ఆయన ఇష్టమే ఈయన ఇష్టం. భగవంతుడు మనకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని చిన్నపనా, పెద్దపనా అని కాదు, దానిని శ్రద్ధగా చేయాలి. కృష్ణుడు అంతటివాడు ఎక్కడా ఉండడని ఎందుకు చెపుతున్నాను అంటే మనం పెళ్ళి భోజనాల దగ్గరకు వెళితే నేతిజారీయో, అన్నమో, కూరో పుచ్చుకొని వడ్డిస్తాము. కృష్ణుడు ఇవి ఏమీ చేయడు, అందరూ తినేసాక ఆకులు తీసేవాడు, వాడు దేవుడు. ఆకులు తీయటం తక్కువ పని అనుకొంటాము, అన్నం, కూరలు వడ్డించటం గొప్పపని అని మనం అనుకొంటాము. అసలు మనకు పనియందు గౌరవం లేదు. ఎప్పడైనా ఆకులు తీయండి అప్పడు మీ బుద్ధి ఒకరకంగా ఉంటుంది, నెయ్యి వడ్డించేటప్పడు ఒకరకంగా ఉంటుంది. ఆకులు తీసేటప్పడు ఏదో తక్కువ రకం పనిచేస్తున్నాము అని మీకు అనిపిస్తుంది. విస్తర్లు తీసినవాడిని ఆరాధిస్తున్నారు కాని మనలను ఎవరు ఆరాధించటం లేదు. భక్తి పేరు మీద పని దొంగలుగా ఉండవద్దు అని గీతలో పరమాత్మ చెప్పాడు.

ఈరోజు రమణమహర్షిగారు అరుణాచలం వచ్చిన రోజు. 1896వ సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీన అరుణాచలం వచ్చారు. 54 సంవత్సరాలు ఆయన శరీరం అరుణాచలంలో తిరుగాడింది. అరుణాచలంతో ఆయనకు జన్మాంతర అనుబంధం ఉంది. ఈ క్షేత్రంతో ఆయనకు ఉన్న అనుబంధం ఎటువంటిది అంటే ఈ అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్ళాలనే తలంపు కూడా నాకు రాలేదు అని భగవాన్ చెప్పారు. పూర్వం చాలామంది మహాత్ములు వచ్చారు, వారు పుణ్యక్షేత్రాలు దర్శించారు, అలాగే మీరు కూడా చేయాలి కదా అని ఒకరు భగవాన్‌ను అడిగితే పూర్వం మహాత్ములు చూసి ఉండవచ్చు, ఏదో చూడాలనే సంస్కారం, ఆ వాసన నాకు లేదు అన్నారు. ఆయనకు 16వ సంవత్సరంలో అమృతానుభవం కలిగింది. కొన్ని క్షణాలలో దేశకాలాలను ఓవర్‌కమ్ చేసాడు. దేశకాలములతో సంబంధం లేకుండా అంతటా ఉన్నాను, నేను లేనిచోటు అంటూ లేదు అనే అనుభవం కొన్ని క్షణాల కాలంలో కలిగింది. రమణమహర్షి కృపాసిద్ధుడు. దేవుడు కృప చూపించాడు. జ్ఞానం ఇచ్చాను అన్నాడు, అంతే పని అయిపోతుంది. మనం జ్ఞానం కోసం కొట్టుకొని చస్తున్నాము. కొంతసేపు పూజలు అంటున్నాము, జపాలు అంటున్నాము, నదులలో మునుగుతున్నాము, కొండలచుట్టూ తిరుగుతున్నాము. ఇంత చేసినా ఏమీ రావటం లేదు. కాని భగవాన్‌ను ఈశ్వరుడు అనుగ్రహించాడు, కొన్ని క్షణాలలో మహాజ్ఞాని అయిపోయాడు. బాహ్యంగా చూస్తే ఆయన ఏమైనా కష్టపడ్డాడా? లేదు. బడిలో చదువుకొనే

పిల్లవాడు. కాని ఆయనకు జన్మాంతరంలో అంతా అయిపోయింది, పండిపోయివచ్చాడు, అది మనకు కనబడదు. ప్రతీ చిన్న పనికి భగవంతుడు రాడు, ఆయన ప్రతినిధిని పంపుతాడు, ప్రతీజ్ఞాని కూడా ఆయన ప్రతినిధే. బ్రహ్మానుభవం పొందినవారినందరిని ఆయన ఉపయోగించుకొంటాడు. అందుచేత వారికి ఇచ్చే గౌరవం నాకే ఇచ్చారు అనుకొంటాడు. దేహబుద్ధి లేనివాడికి ఎవడికి నమస్కారం పెట్టినా అది నారాయణుడికే అందుతుంది, అక్కడ ఉన్నవాడు ఆయనే. భగవాన్ అరుణాచలం వచ్చిన రోజున నిక్కరుని గుడి దగ్గర ఉన్న కోనేరులో పడేసారు, చొక్కా చింపి గోచీ పెట్టుకొన్నారు, తన దగ్గర ఉన్న మూడు రూపాయలను, స్వీట్సును కోనేటిలో పడేసారు. కొన్ని క్షణాలలో సన్యాసి అయ్యాడు. ఆయన శీతాకాలం, వర్షాకాలం, వేసవికాలం అనకుండా ఎప్పడూ గోచీతోనే ఉన్నారు. ఒక ఎకరం ఉన్నవాడికి పది ఎకరాలు కలిసివస్తే జీవిత విధానం మారిపోతుంది, నోటికి పక్షవాతం వచ్చేస్తుంది. తెలుసున్నవారు కనబడితే కూడా మీరు ఎవరు అంటాము. అధికారం ఒకటి, ధనం ఒకటి తొందరగా బుద్ధిని పాడుచేస్తాయి. ఏదో వంకర మాటలు మాట్లాడతాము. ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఆయన 1896వ సం॥ సెప్టెంబరు 1వ తేదీన అరుణాచలం వచ్చినప్పడు గోచీ పెట్టుకొన్నారు. తరువాత ఆయన దగ్గరకు గవర్నర్లు వచ్చారు, ప్రధానమంత్రులు వచ్చారు, గొప్పగొప్పవారు వచ్చారు, ఆశ్రమంలో డబ్బు వర్షం కింద కురిసింది కాని ఆయన శరీరం విడిచిపెట్టేవరకూ గోచీతోనే ఉన్నారు, ఆయన ఋషి. రామకృష్ణ పరమహంస ఏమి చెప్పారు అంటే మీరు ఎప్పడూ మామూలు చీరలు కట్టుకొంటున్నారు అనుకోండి, ఒక్కసారి బాగా ఖరీదైన చీర కట్టుకోండి, ఆ రోజున మీ మనస్సు మారిపోతుంది, అంటే ఆడంబరజీవితం వచ్చేటప్పటికి మీరు ఎంత కంట్రోలు చేసుకొందాము అనుకొన్నా దాని ప్రభావం మీ బుద్ధిమీద పడిపోతుంది అని చెప్పారు.

భగవాన్ చాలాకాలం మౌనంగా ఉన్నారు. ఆయన మౌనంగా ఉండాలని ఉండలేదు, చాలాకాలం నన్ను ఎవరూ పలకరించలేదు అందుచేత నాకు మాట్లాడవలసిన పనిలేదు అని చెప్పారు. సాధకులు అవకాశం ఉంటే వారానికి ఒక రోజు మౌనంగా ఉండటం మంచిదే. దాని వలన శక్తి పెరుగుతుంది, వాగుడు తగ్గుతుంది, నాలుక కంట్రోలులో ఉంటుంది. ఈ నాలుక చాలా ప్రమాదం. అజాగ్రత్తగా మాట్లాడితే విరోధాలు తెచ్చిపెడుతుంది, జాగ్రత్తగా మాట్లాడితే స్నేహాలు తెచ్చిపెడుతుంది. అందుచేత అజాగ్రత్తగా ఉండవద్దు, జాగ్రత్తగా ఉండండి. ఇంతకంటే కత్తి మెరుగు, కత్తితోటి తగిలిన గాయం తొందరగా తగ్గుతుంది కాని నాలుకతోటి అనవసరమైన మాటలు మాట్లాడితే ఆ గాయాలు అలాగ ఉండిపోతాయి. అందుచేత మనం మాట్లాడే మాటలు సాత్వికంగా, హితవుగా, మితంగా ఉండాలి. మనకు నాలుక ఉందని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే మనకు పాపాన్ని తెచ్చిపెడుతుంది. కొంతకాలం తరువాత భగవాన్ అమ్మగారు

అక్కడకు వచ్చారు, ఇంటికి రమ్మని అడిగారు. అప్పడు ఆయన కాగితం మీద వ్రాసి ఇచ్చారు. ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధం ననుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు, ఊరక ఉండటం ఉత్తమం అని వ్రాసారు. నోటితో ఊరక ఉంటే సరిపోదు, మనస్సులో కూడా ఊరక ఉండాలి. తరువాత తల్లిగారు వెళ్ళిపోయారు, తరువాత భగవాన్ కొంతకాలం విరూపాక్షగుహలో ఉన్నారు. అక్కడ ఉండగా గణపతిశాస్త్రిగారు వచ్చారు. రమణమహర్షిగారి వైభవం మొదట గుర్తించింది గణపతిశాస్త్రిగారు. తరువాత కొంత కాలం స్కందాశ్రమంలో ఉన్నారు, అక్కడ నుండి 1922వ సంవత్సరంలో రమణాశ్రమం వచ్చింది. మీరు అప్పడు కొండలలో రాళ్ళమీద కూర్చొనేవారు, ఇప్పడు సోఫాలో కూర్చొంటున్నారు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. అప్పడు భగవాన్ ఒక మాట చెప్పారు. దేహానికి ప్రారబ్ధం ఉంటుంది, అప్పడు దేహం రాళ్ళమీద కూర్చోవలసి వచ్చింది, ఇప్పడు సోఫాలో కూర్చోవలసి వచ్చింది, దేహం ప్రారబ్ధాన్ని బట్టి నడుస్తుంది. కాని అప్పడు రాతి మీద కూర్చొన్నానని నేను దుఃఖపడలేదు, ఇప్పడు సోఫాలో కూర్చుంటున్నానని సంతోషం రావటం లేదు అన్నారు. ఎందుచేతనంటే తాను దేహమాత్రుడను కాదు అని ఆయనకు తెలుసు. మనం భగవంతుడి యొక్క ఏదో రూపాన్ని ఆరాధించుకొంటూ ఉంటే, ఆ నామాన్ని స్మరించుకొంటూ ఉంటే మన రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలో నుండి బయటకు వచ్చేస్తాము. దేహాభిమానంలో నుండి, ధనాభిమానంలోనుండి, విద్యాభిమానంలోనుండి, కులాభిమానంలోనుండి అన్ని అభిమానాలలోనుండి విడుదల పొందుతాము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-04-06, ఆత్రేయపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నాలుగు రకాల కర్మలు ఉన్నాయి. మనం రోజూ కాలకృత్యాలు తీర్చుకొంటాము, స్నానం చేస్తాము, అన్నం తింటాము. ఇవన్నీ స్వాభావిక కర్మలు. వీటి వలన పుణ్యంరాదు, పాపంరాదు. మనకు శరీరం ఉంది కాబట్టి దానిని నిలబెట్టుకోవటం కోసం ఏవో పనులు చేస్తాము, వీటిని స్వాభావిక కర్మలు అంటారు, ఇవి శరీరానికి సంబంధించిన కర్మలు. నేను స్నానం చేసాను, అన్నం తిన్నాను దానికి పుణ్యం అంటే దానికి పుణ్యం ఏమీ లేదు. 2. నైమిత్తిక కర్మలు, వీటి వలన పుణ్యం లేదు, పాపం లేదు. మన శరీరానికి రోగం వస్తే మందులు వాడతాము, అంటే సందర్భాన్ని బట్టి చేస్తాము, ఇవి నైమిత్తిక కర్మలు. ఇవి రోజూ చేయము, సందర్భాన్ని బట్టి చేస్తాము. 3. సకామ కర్మ. మనకు పొట్ట ఉంది, పొట్ట పోషణ కోసం ఏదో పని చేసుకోవాలి. పొట్టకోసం ఇతరులమీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. మన దేహ యాత్రకు సరిపడ పని చేసుకొంటూ,

సత్కర్మ కూడా ఎంతో కొంత చేస్తూ ఉండాలి. సత్కర్మ చేయనివాడు నిష్కామకర్మ చేయలేడు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. ముందు సకామకర్మ, ప్రతీ మనిషి ఏదో ఫలాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేస్తూ ఉంటాడు. వారు చేసే కృషిలో ఈశ్వర కటాక్షం కనుక ఉంటే కొంతమందికి వారి కుటుంబ అవసరాలకు మించి ఎక్కువ డబ్బు వస్తూ ఉంటుంది. అలా వచ్చినప్పడు కొంత డబ్బు కేటాయించుకొని మంచి పనులు చేస్తూ ఉండాలి. మీకు వచ్చిన డబ్బులో కొంత కుటుంబ పోషణకు ఉపయోగించుకొంటూ, కొంతభాగం సమాజానికి ఉపయోగిస్తే, సమాజానికి ఉపయోగించిన డబ్బు ఏమీ వృధా అవ్వదు, అది దేవుని బ్యాంక్‌లో పడుతుంది. ఇక్కడ బ్యాంకులలో మీరు దాచుకొన్న డబ్బు మీ వారసులు తినేస్తారు, మహాచేస్తే పదకొండవ రోజు ఘనంగా చేస్తారు, తరువాత మీ పేరు కూడా తలపెట్టరు, ఇక్కడ బ్యాంకులలో ఉన్నది పరలోకంలో చెల్లదు. మీరు ఇతరులకు చేసిన సాయం దేవుడు తన బ్యాంక్‌లో వేసుకొని మీకు పరలోకంలో ఇస్తాడు. మీరు సత్కర్మ చేస్తూ ఉంటే ఏదో జన్మలో నిష్కామకర్మ చేసే అలవాటు వస్తుంది. అంతేగాని ఏదో ఒక గంటలో నిష్కామకర్మ చేసేస్తాను, స్వార్థం లేకుండా నేను పని చేస్తాను, ఇతరులను ఉద్ధరిస్తాను అంటే అది జరిగేపని కాదు, ఇవి అన్నీ బుడబుక్కల మాటలు. కొన్ని జన్మలు సత్కర్మ చేస్తూ, కర్మఫలాన్ని సమాజానికి త్యాగం చేస్తూ ఉంటే నిష్కామకర్మ చేసే అలవాటు వస్తుంది. 4. నిష్కామ కర్మ అంటే ఏరకమైన కోరిక లేకుండా పని చెయ్యటం. నిష్కామ కర్మ చేసేవాడికి ఫలకాంక్ష ఉండదు. కోరిక లేకుండా పని చేస్తూ ఉంటాడు. వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. నిష్కామకర్మ చేసేవాడు ధర్మం, అధర్మం గురించి ఆలోచించి ధర్మాన్ని పట్టుకొంటాడు, అధర్మాన్ని వదిలేస్తాడు, సత్యం అసత్యం గురించి ఆలోచించి సత్యాన్ని పట్టుకొంటాడు, అసత్యాన్ని వదిలేస్తాడు, ఆత్మ అనాత్మ గురించి ఆలోచించి ఆత్మను పట్టుకొంటాడు, అనాత్మను వదిలేస్తాడు. ఇలా విభజించుకొంటూ, విభజించుకొంటూ వెళ్ళిపోయి అదే జన్మలో బ్రహ్మజ్ఞాని అయిపోతాడు. నిష్కామకర్మ చేస్తూ ఉంటే వివేకం, వైరాగ్యం పెరుగుతుంది.

మనం పైకి అందరిలాగ కనబడుతూ ఉండాలి, లోపల వైరాగ్యం పెంచుకొంటూ రావాలి. జీవితంలో ఎంతోకొంత త్యాగం చేయకపోతే శాంతి దొరకదు. అలాగని మీ సంసారాలు పాడుచేసుకోమని భగవంతుడు చెప్పటంలేదు. సమాజానికి ఉపయోగపడే శక్తి మీకు ఉన్నప్పడు ఎంతోకొంత ఉపయోగపడండి. మీరు ఇతరులకు చేసే సహాయ సహకారములు మీకే తిరిగి వస్తాయి కాని భగవంతుడికి ఏమీ అక్కరలేదు. మనం నిష్కామకర్మ చేస్తూ ఉంటే మనం పవిత్రులం అవుతాము, తరువాత భయం తగ్గిపోతుంది. మన లోపల హృదయగ్రంథి ఉంది, అది ఉన్నంత సేపు పునర్జన్మలు ఆగవు. అది ఏమి చేస్తుంది అంటే మనం ఏదైతే అవునో అది కాదని చూపిస్తుంది, ఏదైతే కాదో అది అవునని చూపిస్తుంది. హృదయగ్రంథి ఉన్నంతకాలం

నిన్ను సంసారం విడిచిపెట్టదు. మనం ఇంటి దగ్గర స్వాభావికకర్మలు అయిన తరువాత భగవద్గీతకాని, భాగవతంకాని ఇంకా ఏవైనా మంచిగ్రంథాలు కాని అధ్యయనం చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు లౌకికులతో స్నేహం తగ్గించుకోవాలి. ఇతరుల వ్యవహారంలో కలుగజేసుకొంటే హృదయగ్రంథి పెరిగిపోతుంది. హృదయగ్రంథి ఎవడికైతే తెగిపోయిందో వాడికి ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనట్లుగా తెలుస్తుంది. ఎంతో సత్కర్మ చేసిన వాడికిగాని, నిష్కామకర్మ చేసిన వాడికి గాని, పరమపవిత్రుడికి గాని ఈ హృదయగ్రంథి తెగదు. మనందరం సంసారంలో ఉన్నాము. భగవంతుడిని మరిచిపోయి, ఈ లోకంలోనికి ఎందుకు వచ్చామో మరిచిపోయి, నిష్కామకర్మ ఏమీ చేయకుండా, జపధ్యానములు లేకుండా ఇంక 24 గంటలు కుటుంబం కోసమే బతుకుతాము అనుకోండి, దాని వలన హృదయగ్రంథి పెరిగిపోతుంది, కోటి జన్మలకు కూడా హృదయగ్రంథి తెగదు అనుకోండి మనకు ఆత్మజ్ఞానం కలిగే సమస్యే లేదు. సజ్జన సాంగత్యం హృదయగ్రంథిని ఛేదిస్తుంది. మనకు తిండి దగ్గర నిగ్రహం లేదు అనుకోండి, వ్యవహారంలో నిగ్రహం లేదు అనుకోండి, సంభాషణలో నిగ్రహం లేదు అనుకోండి, ఇతరులతో ఎలా వ్యవహరించాలో మనకు తెలియటం లేదు అనుకోండి దాని వలన కూడా హృదయ గ్రంథి పెరిగిపోతుంది. ఫలానాపేరు నాది, ఫలానా శరీరం నాది, నాకు ఇంత గౌరవం ఉంది ఇంత డబ్బు ఉంది అని ఇలా అనుకొంటూ ఉంటాము అనుకోండి, ఇవన్నీ జీవలక్షణాలు, వీటి వలన కూడా హృదయగ్రంథి పెరిగిపోతుంది. మీరు కొంత టైము సత్కర్మ చేస్తూ, కొంత టైము మంచి గ్రంథాలు అధ్యయనం చేస్తూ, కొంతకాలం సత్పురుషులతో సహవాసం చేస్తూ ఇవన్నీ కలుపుకొని మీరు టైమును మేనేజ్ చేసుకొంటూ ఉంటే నెమ్మదిగా హృదయగ్రంథి పలచబడి, ఏదో రోజున తెగిపోతుంది.

మేము భక్తులం, భక్తులం అంటే ఏదో ఆలయానికి వెళ్ళి నమస్కారం పెట్టుకొని వస్తున్నంత మాత్రం చేత మనం భక్తులం కాదు, అందరి హృదయంలో ఉన్న సద్వస్తువును దర్శించినవాడే నిజమైన భక్తుడు. మనం గుడికి వెళ్ళి హారతిపళ్ళెంలో ఒక రూపాయి వేస్తాము, వేసినప్పుడు అది సేవ అనుకోము, అది పూజ అనుకొంటాము. అలాగ మానవజాతిపట్ల నువ్వు ఏ పని చేసినా సేవ కింద చేయకూడదు, పూజకింద చేయాలి, అలా చేయటం వలన పుణ్యం వస్తుంది. మనకు ఆత్మజ్ఞానం కలగాలంటే పుణ్యబలం సపోర్టుగా ఉండాలి. పుణ్యబలం సపోర్టుగా లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. పుణ్యబలం యొక్క సపోర్టు లేకపోతే, సత్కర్మ యొక్క సపోర్టు లేకపోతే మనస్సుకు లోచూపు కలుగదు. లోచూపు కలిగితేకాని లోపల ఉన్న స్వరూపం మనకు వ్యక్తం కాదు. హృదయంలో ఉన్న వస్తువు మనకు స్వరూపంగా వ్యక్తమవ్వాలంటే వివేకం అవసరం, వైరాగ్యం అవసరం, సత్కర్మ యొక్క సపోర్టు అవసరం, పుణ్యబలం అవసరం.

సత్యవస్తువు మన హృదయంలో ఉంది, ఉండటమే కాదు అది మనమై ఉన్నాము. దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం శాంతి. అది ఎప్పడూ ఉంటుంది. మన శరీరం ఉన్నా లేకపోయినా, లోకం కనిపించినా కనిపించకపోయినా అది ఉంది. మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక ఎరుక మనకు రావటం లేదు. నా జేబులో పది రూపాయలు ఉన్నాయనుకోండి, నా జేబులో డబ్బు ఉంది అని నాకు తెలియదనుకోండి, నాకు సోడా తాగాలని ఉంటే మిమ్మల్ని డబ్బులు అడగాలి. డబ్బులు నా జేబులో ఉన్నా ప్రయోజనం లేదు, ఉందని నాకు తెలియాలి. అలాగే మనలోపల బ్రహ్మం ఉంది. దాని తాలుక ఎరుక మనకు లేకపోవటం వలన సుఖం కోసం, శాంతికోసం ఎక్కడో బజారులో వెతుక్కొంటున్నాము. నీవు ఎంత పండితుడవైనా, ధనవంతుడివైనా హృదయగ్రంధి తెగేవరకూ లోపల ఉన్న వస్తువు గురించి నీకు తెలియదు. హృదయగ్రంధి తెగటం అంత తేలిక కాదు. మన గమనం ఎలాగ ఉండాలి అంటే మన చేత హృదయగ్రంధి ఎప్పటికప్పడు ఛేదింపబడేలా ఉండాలి. స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం మనం చేసే పని జాగ్రత్తగా చేసుకొంటూ వెళ్ళాలి, మనం చేసేది సత్కర్మ అయితే కాలం కలిసివస్తుంది. కాలం కలిసి వస్తే సరిపోదు, మన హృదయంలో ఉన్న కంట్రోలర్ యొక్క దయ కలగాలి. ఇన్ని ఉంటేనేగాని హృదయగ్రంధి ఛేదింపబడదు.

మీరు ఏపనిచేస్తున్నా, ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నా భక్తి సపోర్టుగా ఉండాలి. పంచదార లేని కాఫీ, టీ ఎలా ఉంటాయో, భక్తి లేకుండా మీరు ఎన్ని మంచి పనులు చేసినా అవి స్వీట్‌గా ఉండవు. మనం చేసే పనులు షార్ట్‌గా ఉన్నా పరవాలేదు స్వీట్‌గా ఉండాలి. మీరు ఏ పనిచేసినా భక్తితో చేయాలి. మిమ్మల్ని ఎవరైనా గౌరవిస్తున్నారు అనుకోండి, మీలో భక్తిభావన, సమాజం పట్ల సహృదయం, తోటిమానవుడికి ఉపయోగ పడాలనే కాంక్ష, నిరహంకార స్థితి, నిరాడంబర స్థితి ఏదో విశేషం ఉండి ఉండాలి. మీలో ఏమీ లేకుండా పదిమంది మిమ్మల్ని గౌరవించరు, పూజించరు, హృదయగ్రంధి ఎలా ఫారమ్ అవుతుంది అంటే అహంకారం వల్ల, మమకారం వల్ల అది ఫారమ్ అవుతుంది, సజ్జన సాంగత్యం హృదయగ్రంధిని ఛేదిస్తుంది, అది మీకు బాహ్యంగా కనబడదు. భగవాన్ స్కంధాశ్రమంలో ఉండగా ఒకతను వరుసగా పది రోజులు భగవాన్‌ను చూడటానికి వచ్చాడు. మనం భగవాన్‌ను చూడటానికి పది రోజుల నుండి వస్తున్నాము ఏమీ కలిసి రావటం లేదు, ఏమీ లాభం కనబడటం లేదు అని పదకొండవ రోజు నుండి రావటం మానివేసాడు. అలా కొన్ని రోజులు భగవాన్ దగ్గరకు రాలేదు. ఏమిటి భగవాన్‌ను చూడటం మానివేసాను, భగవాన్‌ను చూసి చాలా రోజులు అయ్యింది అని అతనికి దుఃఖం వచ్చింది, అప్పడు మరల స్కందాశ్రమం వెళ్ళాడు. మిమ్మల్ని చూడటానికి పది రోజులు వరుసగా వచ్చాను, నాకు ఏమీ లాభం కనబడలేదు అని రావటం మానివేసాను, మరలా

చూడాలనిపించి ఇప్పుడు వచ్చాను అని భగవాన్‌తో చెప్పాడు. చూడటం వలన వచ్చే లాభం కనిపించకపోవచ్చు, చూడకపోవటం వలన వచ్చే నష్టం నీకు తెలుస్తోంది కదా అన్నారు భగవాన్. జ్ఞాని చేసే ఉపకారం మీకు బాహ్యంగా కనబడదు ఎందుకంటే జ్ఞానికి గుర్తింపులు అక్కరలేదు. మీ ప్రక్క వారికి కూడా తెలియకుండా మిమ్మల్ని అనుగ్రహిస్తాడు, వాడు జ్ఞాని. నా ఎడమచేతిలో పండు ఉంది అనుకోండి అది కుడిచేతిలో పెట్టుకొంటే, ఎవరినో ఉద్ధరించాను అని నేను అనుకోను ఎందుచేతనంటే కుడిచెయ్యినాదే, ఎడమచెయ్యినాదే. జ్ఞాని చేసే సత్కర్మ అలాగే ఉంటుంది. ఎవరినో ఉద్ధరించాను అని జ్ఞాని అనుకోడు. ఎందుచేతనంటే వాడికి భిన్నంగా ఇతరులు లేరు, అంతా తానే. మనకు బ్రాహ్మీస్థితి కలిగేవరకు కుటుంబసభ్యులు మారతారు, పరిసరాలు మారతాయి, దేహాలు మారతాయి, స్నేహితులు మారతారు, ఈ సంసారం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. జాగ్రదవస్థలోనికి రాగానే మనకు మొదట నేను అనే తలంపు వస్తోంది. అది వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి, మనకు నేను అనే తలంపు తెలుస్తోంది కాని అది ఎక్కడనుండి వస్తోందో మనకు తెలియటంలేదు, అదితెలిస్తే హృదయగ్రంథి ఛేదింపబడుతుంది.

నీకు అశాంతి వచ్చినా, నీకు దుఃఖం వచ్చినా దానికి నువ్వే కారణం, దానికి ఇతరులు కారణం కాదు అది ముందు నీకు తెలియాలి. కొంతమంది జరిగిపోయిన గొడవలు ఎక్కువగా తలపెట్టుకొంటూ ఉంటారు, దాని వలన హృదయగ్రంథి బలపడుతూ ఉంటుంది. కొంతమంది వాయిదా మనుషులు ఉంటారు. ఈవేళ ఇల్లు తుడుచుకొందామా అంటే రేపు అంటారు, మీరు ఏ పని చేసినా రేపు అంటారు కాని ఈవేళ భోజనం రేపు తిందాము అనుకోరు, అప్పడే తినేస్తారు. మరణం మన చేతిలో లేదు, ఈవేళ ఆరోగ్యంగా ఉండవచ్చు, రేపు మనం చనిపోవచ్చు. అందుచేత సాధన విషయంలో వాయిదాలు వేయవద్దు. ఏ రోజు సాధన ఆరోజు చేసుకోండి, భగవంతుని స్మరణ విడిచిపెట్టవద్దు. ఏరోజు పని ఆ రోజు చేసుకోండి. కొంతమంది మా తాతలు గొప్పవారు అని పూర్వపు గొడవలు చెపుతూ ఉంటారు. సరే మీ తాతలు గొప్పవారు అయితే ఇప్పడు నీ మాట ఏమిటి? వారి గొప్పలు చెప్పకొంటూ, నీవు పని పాటా లేకుండా, సాధన లేకుండా కూర్చొంటావా? సోమరితనానికి అలవాటుపడిన వారికి ఈ లోకం లేదు, పరలోకం లేదు. నిరంతరం ఎవరైతే నన్ను స్మరిస్తున్నారో, నా వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తున్నారో, నా పనిని వారి సొంత పనిగా భావించి ఎవరైతే చేస్తున్నారో వారి యోగ క్షేమాలు నేను చూస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. ఆంజనేయస్వామి ఏది చూసినా, ఏది చేసినా, ఏది తిన్నా, ఏది విన్నా రాముడి కోసమే, ఆయనకు సొంత పని అంటూ ఏమీ లేదు. మా ప్రాంతంలో హోలీ కంపెనీ దొరకకపోతే ఏమి చేయమంటారు అని బుద్ధుడిని అడిగితే

ఒంటరిగా జీవించు. ఈ రోజు ఉదయం కాఫీ దొరకలేదు అని ఎండ్రిన్ తాగము, కాఫీ దొరకకపోతే తాగటం మానివేస్తాము అలాగే మంచి స్నేహాలు దొరికితే సరే, దొరకకపోతే ఒంటరిగా జీవించు అంతేగాని చెడుస్నేహాలు వద్దు, చెడుస్నేహాల వలన మనస్సు పొల్యూట్ అయిపోతుంది.

ఇష్టమైన పనులు అందరూ చేస్తారు. ఎవరికిష్టమైన పని వారు చెయ్యటంలో గొప్ప ఏమీ లేదు. అది మంచి పనైతే, ఆ పని భగవంతుడు చెయ్యమని చెపితే ఆ పని నీకు ఇష్టం లేకపోయినా నువ్వు హితవు చేసుకొని చెయ్యటంలో గొప్పతనం ఉంది. అప్పుడు హృదయగ్రంథి ఛేదింపబడుతుంది. చేతితో మంచి పనులు చేస్తూ ఉంటే, నోటితో ఇతరుల హితవు కోరి మాట్లాడుతూ ఉంటే, మంచి ఆలోచనతో మనస్సును నింపుకొంటే, ఈ మూడింటిని పాజిటివ్‌గా ఉపయోగించు కొంటే హృదయగ్రంథి పలచబడుతుంది. మీరు ఏదైనా మంచి చెపుతూ ఉన్నా ఇష్టం వచ్చినట్లు చెప్పకూడదు, ఎదుటివారికి అర్థమయ్యేలా, వారి మనస్సులో మార్పు వచ్చేలా చెప్పాలి. మంచి భాష ఒక్కటే సరిపోదు లోపల ఉద్దేశ్యం మంచిదై ఉండాలి. గురువు అంటే ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. మీరు అనేక జన్మలనుండి సత్కర్మ చేస్తూ ఉంటే, భగవంతుడిని ఆరాధిస్తూ ఉంటే, ఆయన కోసమే జీవిస్తూ ఉంటే ఆయనకు మీ పట్ల దయ కలిగి ఈ శవం నేను, ఈ శవం నేను అని మీరు అనుకొంటున్నారు కదా, ఆ శవబుద్ధిని పోగొట్టటానికి ఆయన కూడా ఒక శవం వేసుకొని వస్తాడు, వాడు గురువు. మనం ఏ శరీరంలో ఉంటే ఆ శరీరమే మనం అనుకొంటాము, కాని భగవంతుడు ఆ శరీరంలో ఉన్నప్పుడు కూడా ఆయన శరీరమాత్రుడు కాదని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. ఆయన మనతో కలిసి తిరుగుతాడు, మనతో మాటలు చెపుతూ మనతో పరిచయం పెంచుకొని హృదయగుహలోనికి మనలను తోలుకొనిపోతాడు, వాడు గురువు. ఏదో జపం చేసి, ధ్యానం చేసి మనస్సును హృదయాభిముఖం చేయటం కాదు, ఇప్పుడు మన మనస్సు శిరస్సులో ఎంత సహజంగా ఉంటుందో అంత సహజంగా హృదయంలో ఉండగలగాలి, అప్పుడు మనోనాశం అవుతుంది.

గురువు మీ పూర్వజన్మలను చూస్తూ ఉంటాడు, పునర్జన్మలను తీసుకొని వచ్చే సంస్కారాలు మీలో ఏమి ఉన్నాయో చూస్తూ ఉంటాడు, వాటిని ఎలా తొలగించాలో చూస్తాడు. మీ లోపల ఉన్న బలహీనతలు కొన్ని మీకు తెలియవు, వాటిని మీ సహస్రారంలోనికి తీసుకొని వచ్చి, ఆ బలహీనతలు ఉన్నాయి అని మీకు తెలియజేసి, వాటిని తొలగించుకొనే శక్తిని మీకు ప్రసాదిస్తాడు. మీ లోపల ఉన్న వాసనలను మీ బ్రెయిన్‌లోనికి తీసుకొని వచ్చినప్పుడు ఆ బలహీనత ఉందని మీకు తెలుస్తుంది, అది తెలియటానికి కూడా గురువే

కారణం. దాని తాలుక బాధ మీరు పది రోజులు అనుభవించాలి అనుకోండి, పది గంటలలో మీ చేత అనుభవింపచేసి మిమ్మల్ని బయటకు లాగేస్తాడు, వాడు గురువు. అయితే గురువు తను ఏదిగా ఉన్నాడో దాని తాలుక అనుభవం నీకు కలిగే వరకు నిన్ను విడిచిపెట్టడు. ఈ దేహం చనిపోయి మీరు ఇంకో దేహంలో ఉన్నా, ఇంకో లోకంలో ఉన్నా మీ ఎడ్రసు గురువుకు తెలుస్తూ ఉంటుంది, పూర్ణస్థితిని పొందేవరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. ఈశ్వరుడు లింగరూపంలో ఉన్నాడు. లింగం అంటే గుర్తు, పరమేశ్వరుడు ఉన్నాడనే గుర్తు. దానిని సపోర్టుగా తీసుకొని, ఆ లింగాన్ని ఆరాధించి సాకారంలో నుండి నిరాకారంలోనికి, సగుణంలో నుండి నిర్గుణంలోనికి వెళ్ళాలి. ముందు గుడిలో ఉన్న దేవుడిని చూడటం నేర్చుకొంటే తరువాత అందరి హృదయాలలో ఉన్న దేవుడిని చూడటానికి అలవాటుపడతాము. ఒక భక్తుడిని చూసి వాడు నాకు విరోధి అని మీరు అనుకోవచ్చుకాని, మీరు వాడికి విరోధి అని ఆ భక్తుడు అనుకోడు, అలా అనుకొంటే వాడు భక్తుడే కాదు. కలియుగ లక్షణం ఏమిటో అందరూ యోగాభ్యాసాలు, ప్రాణాయామం అంటున్నారు, అసలు భక్తి తగ్గిపోతోంది. భక్తి ఉంటే భగవంతుడిని పొందే లక్షణాలు మనకు వస్తాయి. వారు విమర్శిస్తున్నారు, వీరు పొగుడుతున్నారు అని మనం అనుకొంటాము కాని భక్తుడు ఈ గొడవలన్నింటికి అతీతుడు, ఈ గొడవలు ఏమీ వాడిని అంటవు. ఎందుచేతనంటే వాడి మనస్సు భగవంతుడి పాదాల దగ్గర స్థిరంగా ఉంటుంది.

ఇప్పుడు ఇన్ని శరీరాలు ఇక్కడ కూర్చొన్నాయి, ఇందులో ఏదో ఒక శరీరం అంటే నాకు ఇష్టంగా ఉంది అనుకోండి, నా బుద్ధిలో ఏదో దోషం ఉందని గుర్తు. ఈ మధ్యన ఒక డాక్టరుగారు నన్ను చూడటానికి వచ్చారు. మీరంటే నాకు ఇష్టం అని ఆ డాక్టరుగారితో అన్నాను. నేనంటే మీకు ఇష్టం ఏమిటండీ, దానిని ఇష్టం అనరు. ప్రేమ అంటారు అని డాక్టరుగారు అన్నారు. ప్రేమ వేరు, ఇష్టం వేరు. ప్రేమలో కోరిక ఉండదు, ఇష్టంలో కోరిక ఉంటుంది. ఇప్పుడు మనం భగవంతుడిని ప్రేమిస్తున్నాము అనుకోండి, దానినే భక్తి అంటారు. మనకు ఏదో కోరిక ఉంది అనుకోండి, ఆ కోరిక నెరవేరటానికి భగవంతుడిని ప్రేమించవచ్చు, అందులో తప్పలేదు కాని భగవంతుడి మీద మనకు నూటికి నూరుపాళ్ళు ప్రేమ కలగాలి, ఆ ప్రేమకు కారణం కనబడకూడదు, అప్పుడు ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. శివుడిని ఆరాధించటం వలన రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలో నుండి మనలను విడుదలచేసి నామరూప రహితస్థితికి తీసుకొనిపోతాడు, శరీరం ఉండగానే శరీరం లేనివారికింద అయిపోతాము, అశరీరులమవుతాము, అది శివానుగ్రహం వలన సాధ్యమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10-10-06 | మంగళ | కైకలూరు, టిటిడి కళ్యాణ మండపం |
| 13-11-06 | సోమ | జువ్వలపాలెం |
| 19-11-06 | ఆది | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# ఉపనిషత్తుల సందేశం

ఏ ఉపనిషత్తుకైనా విషయం ఆత్మజ్ఞానమే. దానిని మించిన సాధన ఏమీ లేదు. ఇతర పరిజ్ఞానమేదైనా అవిద్యే. కర్మఫలాలు తాత్కాలికం. ఆత్మజ్ఞానము చిదానంద హేతువు. జగత్తుగా కనబడేదంతా మనస్సు, ఇంద్రియాలు కల్పించిన రూపాలే. ఆత్మ వాటి ద్వారా ప్రకటితమైనంత వరకూ అవి ప్రకాశిస్తాయి. ఆత్మ ఒక్కటే అన్నింటిని గ్రహించేది, అన్నింటికి సాక్షీభూతమైనది. దీపాన్ని చూడటానికి ఇంకొక దీపం అక్కరలేనట్లుగా ఆత్మను గ్రహించటానికి వేరే సాధనయేమీ అక్కరలేదు. స్వరూపంగా ఉండటమే. ఆత్మకంటే భిన్నంగా మరొకటి ఉంది అనే భావనే భయాన్ని కలుగచేస్తుంది. ఆత్మ ఏకమని, అది తానేనని, తన స్వరూపంగానే ఉన్నదని గ్రహింపు. జ్ఞానము కలిగిన వానికి ఎలాంటి భయము ఉండదు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు ఈ విషయాన్నే పదే పదే చర్చిస్తాయి. విషయమంతా ఒకేసారి గ్రహించలేము. జ్ఞానము కలగటానికి కొంత సమయము పడుతుంది. ఆ జ్ఞానానికి అనుగుణంగా ప్రవర్తించటానికి, మాటలలో, చేష్టలలో అది ప్రతిఫలించటానికి ఇంకా చాలా సమయం పడుతుంది. పదే పదే మహాత్ముల ద్వారా శ్రవణం చేసి, విచారణ ద్వారా మళ్ళీ మళ్ళీ మననం చేసి ఆత్మను అనుభవపూర్వకంగా తెల్సుకోవాలి. ఆత్మను తెల్సుకోవాలంటే, ఆ తెల్సుకొనేవాడు ఆత్మకంటే భిన్నమవాలి. కాని ఆత్మకంటే భిన్నమైనది ఇంకొకటి లేదు కనుక ఆత్మానుభూతిని పొందడమే నిజమైన జ్ఞానం. అంతిమ దశలో ద్రష్టా లేడు, దృశ్యమూ లేదు. దీనినే వివరిస్తున్నాయి ఉపనిషత్తులు.

- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్

# గురువు లేకపోతే గైడెన్సు లేదు

జనన మరణ చక్ర బంధం నుండి మనలను ముక్తి కలిగించాలనే తలంపు ఈశ్వరునికి కలిగినప్పడల్లా సద్గురువుగా ఆయన సాక్షాత్కరిస్తాడు. వారు మన మానశిక క్షేత్రంలో "నీవు ఆత్మవే" అన్న బీజం నాటుతారు. అది ఎన్నటికీ వ్యర్థం కాదు దాన్ని మొలకెత్తకుండా చెయ్యటం ఎవరి వల్ల కాదు. గురువు మన వెంట ఉండి మన కర్మలను అక్కడికక్కడే అనుభవించేలా చేస్తూ ముందుకు నడిపించుకొని పోతాడు. గురువుని మనం తెలుసుకోవటం సాధ్యం కానంతగా మరుగు పరచుకొంటాడు. వేమన అన్నారు "తిత్తులోని శివుని స్థిరముగా తెలియక, తిక్క పట్టినరుడు తిరుగుచుండు, దిక్కు( దెల్ప గురువు ఒక్కడే దిక్కురా!" అని. మనలో ఓర్పు విశ్వాసం లేకపోవటం వల్లనే వారిని గుర్తించలేము. గురువు నుండి వెలువడే దివ్య ఆధ్యాత్మిక తరంగాల వల్ల మనం భగవంతుని దగ్గర ఉన్నట్లు అనుభవం కలుగుతుంది. మనలో సత్య ప్రేమ మేల్కొంటుంది. ఆత్మను తెలుసుకొనుటకు గురువు వద్దకు వెళ్ళాలి. అది శాస్త్ర మర్యాద. మనస్సు యొక్క మోస పూరిత పన్నాగాల నుండి శిష్యుని రక్షించే బాధ్యతను, సద్గురువు తనపై వేసుకొంటాడు. గురువు సహాయం లేని వ్యక్తి అజ్ఞానమనే కటిక చీకటిలో మగ్గుతాడు. శ్రీ నాన్నగారు "గురు అనుగ్రహంతో అన్ని బంధాలు తెగిపోతాయి. సాధన అంతా గురు అనుగ్రహంతోనే సాగుతుంది. కాని సాధకుడు 'నా స్వయంకృషి వల్లనే ధ్యానం చేస్తున్నాను' అనుకొంటాడు. కాని చేయించేది గురువే" అన్నారు. సహిబాయి అన్నారు "భగవంతుడు విశ్వాన్ని సృష్టించి నన్ను అందులోకి పంపితే ఆ జనన మరణ చక్రం నుంచి నన్ను గురువు బయటికి తీసాడు. భగవంతుడు అరిషడ్వర్గాలు అనే బందిపోటు దొంగలను నా మీదకు ఉసిగొలిపితే గురవు వాటి బారి నుండి తప్పించారు. భగవంతుడు నన్ను కుటుంబ బంధనాల్లోను ఇంద్రియ వ్యామోహాలో చిక్కేలా చేస్తే గురువు అందుండి తప్పించాడు. భగవంతుడు నన్ను నేనెవడనే నాకు తెలియకుండా మాయలో పడవేస్తే గురువు నా నిజస్థితిని నాకు తెలిపాడు. భగవంతుడు నాకు కనిపించకుండా దాగి ఉంటే గురువు నాకు ప్రత్యక్షంగా ఉన్నారు. నేను మానసికంగా, శారీరకంగా నా గురువు చెరణ దాసుడను" అన్నారు. ఈ విశ్వాసంలో నిజంగా మనం ఉంటే మన ఆధ్యాత్మిక ప్రయాణం పుష్పక విమానంలో గమ్యాన్ని చేరినట్లే. ఇది జరుగుతుంది - జరుగుతుంది, జరిగితీరుతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం**